'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 64 | ఆదివారం | 18.10.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 64 | Sunday | 18.10.2026 | Pages: 8 | Rate: 2



కొరికలే గుర్రాలైతే..!

ఇంట్లో దూరం.. ఆఫీసులో ప్రేమ తీరం

» పలకరింపుల్లో మొదలవుతోన్న బంధం
» కాలేజీ రోజుల జాయ్.. నిత్యం ఎంజాయ్
» ఇంట్లో మౌనం.. ఆఫీసులో ప్రేమ గానం!

వివరాలు 5లో..

కాలేజీ గేటు దగ్గర మొదలైన ప్రేమకథలు ఇప్పుడు కార్యాలయాల కారిడార్లలో కొత్త పుంతలు తొక్కుతున్నాయ్. ఒక చిన్న పలకరింపు.. మరో చిరునవ్వు.. కాఫీ కప్పు దగ్గర కాసేపు మాటామంతీ.. అంతే! మనసులో తెలియని అలజడి మొదలవుతోంది. ఒకప్పుడు క్లాస్‌రూమ్‌లో చూపులు కలిస్తే ప్రేమ చిగురించేది. ఇప్పుడు సమావేశాల మధ్య చూపులు కలుస్తున్నాయి. సహోద్యోగుల సాన్నిహిత్యం పెరుగుతోంది. ఒంటరితనానికి ఆత్మీయత తోడవుతోంది. కానీ ఈ అనుబంధాల వెనుక మరో కథ కూడా ఉంది. ఉదయం నుంచి రాత్రి వరకు ఉద్యోగంతోనే పోరాడుతున్న జీవితాల్లో ఇంటికి మిగులుతున్న సమయం ఎంత? ఒకే ఇంట్లో ఉంటూ మనసులోని మాటలు చెప్పుకోలేని భార్యాభర్తలు ఎందరు? ఇంట్లో దొరకని ఆత్మీయత కార్యాలయంలో లభిస్తే.. అది స్నేహమా? ఆకర్షణా? ప్రేమా? లేక తెలియకుండానే మొదలయ్యే మరో బంధమా? కరోనా తర్వాత మారిన ఉద్యోగ సంస్కృతి, పెరుగుతున్న పని ఒత్తిడి, ఫోన్లలో మునిగిపోతున్న జీవితాలు ఈ ప్రశ్నలను మరింత ముందుకు తెస్తున్నాయి. కార్యాలయంలో పుట్టిన ప్రతి ప్రేమకథకు అందమైన ముగింపే ఉంటుందా? క్షణికమైన ఆకర్షణ కోసం జీవితకాలపు నమ్మకాన్ని పణంగా పెట్టవచ్చా? ప్రేమకు చిరునామా ఆఫీసా.. ఇల్లా? సమాధానం మాత్రం మనసును కదిలించే నిజంలో దాగుంది!

హైదరాబాద్‌కు వాన

• నేడు కూడా కురిసే ఛాన్స్ • ఎండల నుంచి ఉపశమనం

హైదరాబాద్ నగరవాసులకు వాతావరణం నుంచి ఊరట లభించే సూచనలు కనిపిస్తున్నాయి. శనివారం రాత్రి ఫ్యూచర్ సిటీతో పాటు నగర పరిసర ప్రాంతాల్లో పలుచోట్ల వర్షం కురిసింది. యాదాద్రి భువనగిరి, చౌటుప్పల్ పరిసరాల్లో ఏర్పడిన ఉరుములు, మెరుపులతో కూడిన వర్ష మేఘాలు రంగారెడ్డి జిల్లా వైపు కదులుతున్నట్లు వాతావరణ సమాచారం సూచిస్తోంది. (వివరాలు 2లో..)



చలికాలంలో ఎండకాలం

◆ రైతుకు గుండెకోత.. సామాన్యుడికి వాత
◆ సర్కారుకు సంకటం.. ప్రతిపక్షాల చెలగాటం
◆ రేవంత్ నాయకత్వానికి రియల్ సవాల్

తెలంగాణలో ఎల్ నినో ప్రభావం



వివరాలు 6లో..

చలికాలం రావాలి.. చల్లని గాలులు వీయాలి.. కానీ తెలంగాణలో మాత్రం ఎండల సెగ తగ్గడం లేదు! ఆకాశం వర్షించక.. జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గితే.. రేపటి దాహం తీర్చేదెలా? పొలాలకు నీళ్లిచ్చేదెలా? ఇప్పటికే ధరల భారంతో సతమతమవుతున్న సామాన్యుడికి నీటి కష్టాలు మరో శాపంగా మారనున్నాయా? ఎల్‌నినో ప్రభావంతో రాబోయే నెల్లో పరిస్థితులు మరింత కఠినంగా మారవచ్చన్న ఆందోళనలు రాష్ట్రాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. యాసంగిలో పరి సాగుకు దూరంగా ఉండాలన్న సీఎం రేవంత్‌రెడ్డి సూచనలు రైతుల్లో కొత్త ప్రశ్నలు రేపుతున్నాయి. మరోవైపు, నీటి నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందంటూ బీఆర్ఎస్ విమర్శల దాడి పెంచుతోంది. ఏపీలో జల పండుగ.. తెలంగాణలో నీటి గండం అంటూ రాజకీయ రగడ రాజుకుంటోంది. అసలు సమస్య ప్రకృతి సృష్టించిన వర్షాభావమా? అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించడంలో పాలనా వైఫల్యమా? తాగునీరు, సాగునీరు, విద్యుత్.. మూడింటిపైనా ఒత్తిడి పెరిగితే సామాన్యుడి బతుకు ఎలా? రైతు పంటకు భరోసా ఎవరు? ప్రభుత్వం చెబుతున్న ముందస్తు చర్యలు ఎంతవరకు ఫలిస్తాయి? ప్రతిపక్షాల ఆరోపణల్లో వాస్తవమెంత? ఇది కేవలం ఎండల సమస్య కాదు.. తెలంగాణ భవిష్యత్తుకు ఎదురైన నీటి పరీక్ష! అసలు ఏం జరుగుతోంది? రాబోయే రోజుల్లో ముంచుకొచ్చే ముప్పును తప్పించుకునే మార్గాలేంటి?

విద్యుత్, నీటిని పొదుపుగా వాడండి

◆ యువ దర్శకులారా కదలండి!
◆ ఉప ముఖ్యమంత్రి భట్టి పిలుపు

విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించుకోవడం పై ప్రజల్లో అవగాహన పెంచాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క యువ దర్శకులకు పిలుపునిచ్చారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి సంక్షోభం వంటి అంశాలపై ఆకట్టుకునే కథలతో లఘు చిత్రాలు రూపొందించాలని సూచించారు. వినోదంతో పాటు సమాజానికి ఉపయోగపడే



సందేశాలను అందించినప్పుడే సినిమాకు నిజమైన ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. (వివరాలు 2లో..)

నీటి హక్కులకు ద్రోహం

◆ ఏపీలో లేని కరువు తెలంగాణాలోనా?
◆ రేవంత్ సర్కారుపై హరీశ్‌రావు ఫైర్

తెలంగాణ నీటి హక్కులను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం నుంచి నదుల అనుసంధానం చేపట్టాలని కేంద్రానికి లేఖ రాయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ నుంచి నదుల అనుసంధానానికి ప్రతిపాదన ముందుకు వెళ్లిందని గుర్తుచేస్తూ, ఇప్పుడు మార్గాన్ని



మార్చే ప్రయత్నాలు ఎందుకని ప్రశ్నించారు. (వివరాలు 2లో..)



బామ్మర్ది బాగు కోసం రష్యాకు ట్రంప్ వరం!

7లో..

• అమెరికా ఆంక్షలకు బ్రేక్ • ఉక్రెయిన్‌కు ఊహించని షాక్!
• భారత్‌కు భారీ ఉపశమనం • చౌక చమురు ప్రతిఫలం!

బామ్మర్ది కష్టాల్లో ఉంటే బావ ఆదుకోవడం సహజం! మరి ప్రపంచ రాజకీయాల్లోనూ అదే సూత్రమా? రష్యాపై కఠిన ఆంక్షలతో ఉక్కిరిబిక్కిరి చేయాలనుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇప్పుడు అదే ఆంక్షల విషయంలో వెనక్కి తగ్గడం వెనుక అసలు కథేంటి? రష్యా చమురు కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాల ముప్పు పొంచి ఉన్న వేళ.. కీలకమైన మినహాయింపులతో ట్రంప్ తీసుకున్న నిర్ణయం అంతర్జాతీయ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది. ఇది రష్యాకు ఊపిరా? భారత్, చైనాలకు ఆర్థిక ఊరటా? అమెరికాలో పెరుగుతున్న ఇంధన ధరలను అదుపు చేసే వ్యూహమా? లేక ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు వేసిన కొత్త ఎత్తుగడా? పాశ్చాత్య ఆంక్షల మధ్యనూ భారత్, చైనా నుంచి చమురు ఆదాయాన్ని పొందిన రష్యా.. యుద్ధ భారాన్ని ఎంతవరకు తట్టుకుంది? ఆర్థికంగా దెబ్బతిన్నా, ప్రపంచ వేదికపై పరువు కోల్పోయినా.. మాస్కో ఇంకా ఎందుకు వెనక్కి తగ్గడం లేదు? మరోవైపు, రష్యా ఆదాయానికి అడ్డుకట్ట పడకపోతే ఉక్రెయిన్ ఎంతకాలం పోరాడగలదు? ట్రంప్ ఒక్క నిర్ణయం వెనుక చమురు, డబ్బు, దౌత్యం, యుద్ధం.. నాలుగు కీలక సమీకరణాలు దాగున్నాయి. ఈ అడుగు రష్యాకు వరమా.. అమెరికాకు అవసరమా.. ప్రపంచానికి కొత్త సంకటమా? అసలు లెక్క లేంటి..!?

భూవివాదాలకు చెక్.. 3 దశల్లో భూసర్వే

◆ 2,720 గ్రామాల్లో సమగ్ర రీసర్వేకు శ్రీకారం
◆ 285 గ్రామాల్లో పూర్తి.. మరో 400 రోవర్లు సిద్ధం
◆ భూహద్దులకు స్పష్టత.. హక్కులకు భరోసా



తెలంగాణలో తరతరాలుగా కొనసాగుతున్న భూవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర భూ రీసర్వేను మూడు దశల్లో చేపడుతోంది. ప్రతి భూకమతానికి కచ్చితమైన హద్దులు నిర్ణయించి, యాజమాన్య హక్కులపై స్పష్టత కల్పించడమే ప్రధాన ఉద్దేశమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్షలో సర్వే పురోగతిని పరిశీలించారు. (వివరాలు 2లో..)

తెలంగాణ నిధులు.. ఏపీ కాంట్రాక్టర్లకు పనులు!

» రూ. 105.93 కోట్ల కాంట్రాక్టులపై ప్రశ్నలు
» ఆర్టీఐ లెక్కలతో వెలుగులోకి టెండర్ల బాగోతం
» ఉద్యమ ఆకాంక్షలకు విరుద్ధంగా నిర్వాకం
» మహబూబ్‌నగర్ జిల్లాలో విస్తుబోయేలా యవ్వారం



ఉద్యమనినాదం నీళ్లు..నిధులు..నియామకాలు! మరి ప్రభుత్వ పనుల కేటాయింపుల్లో ఏం జరిగింది? మహబూబ్‌నగర్ జిల్లా పంచాయతీరాజ్ శాఖ టెండర్ల లెక్కలు ఇప్పుడు కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. (వివరాలు 4లో..)



రూ.15 కోట్లకు కిడ్నాప్! పోలీసుల వేషంలో మోసం

రియల్ ఎస్టేట్ కక్షతో వ్యాపారి అపహరణ

పది మంది అరెస్టు.. రూ.1.07 కోట్లు స్వాధీనం

హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వివాదం ఓ నగల వ్యాపారిని కిడ్నాప్ చేసే వరకు వెళ్లింది. పోలీసులమంటూ వచ్చి, నకిలీ నంబర్ ప్లేట్ల వాహనాలతో చుట్టుముట్టి, 53 ఏళ్ల కే.శ్రీనివాసరావును అపహరించిన 12 మంది ముఠా చివరకు పోలీసులకు చిక్కింది. (వివరాలు 2లో..)

సొంతూళ్లకు జనం.. నగరంలో రద్దీ

దసరా రద్దీతో హైదరాబాద్ ఉక్కిరిబిక్కిరి!
పండుగ వేళ హైవేలపై వాహనాల బారులు
టోల్ ప్లాజాల వద్ద గంటల తరబడి నిరీక్షణ

దసరా పండుగ వేళ సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో హైదరాబాద్ నగరం కిక్కిరిసిపోయింది. శనివారం ఉదయం నుంచే ప్రధాన రహదారులు, బస్టాండ్లు ప్రయాణికులతో రద్దీగా మారాయి. (2లో..)






అనిరుధ్-కావ్య పెళ్లి పిలుపు!

గ్రీస్‌లో పెళ్లి, చెన్నెలో రిసెప్షన్!

సినిమా సంగీతంలో తనదైన బాణీలతో యువతను ఉర్రూతలూగించే అనిరుధ్ రవిచందర్, ఐపీఎల్ వేదికపై సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో అభిమానుల దృష్టిని ఆకర్షించే కావ్యా మారన్.. ఈ ఇద్దరి మధ్య ప్రేమబంధంపై చాలాకాలంగా సాగుతున్న ఊహాగానాలకు ఇప్పుడు కీలక ప్రకటనతో తెరపడింది. అయితే పెళ్లి తేదీ, వేదికల వివరాలపై అనిరుధ్, కావ్య నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు. ఇంతకీ ఈ ప్రేమకథ ఎప్పుడు మొదలైంది? గతంలో వచ్చిన పుకార్ల వెనుక ఏముంది? నవంబర్ వేడుకలపై ఇప్పటివరకు వెల్లడైన వివరాలేమిటి? పూర్తి కథనం సినిమా పేజీలో..



3లో..

ఎల్‌కే అద్వానీకి ఛాతీ ఇన్ఫెక్షన్!

98 ఏళ్ల నేతకు ఐసీయూలో చికిత్స
నడ్డా పరామర్శ.. నిలకడగా ఆరోగ్యం

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సీనియర్ నేత, మాజీ ఉప ప్రధానమంత్రి లాల్‌కృష్ణ అద్వానీ అనారోగ్యానికి గురయ్యారు. ఛాతీలో ఇన్ఫెక్షన్ కారణంగా ఆయనను శుక్రవారం రాత్రి ఢిల్లీలోని అపోలో ఆసుపత్రిలో చేర్చారు.




4లో..

కోల్‌కతాలో ఘోరం

దుర్గాపూజలో తొక్కిసలాట
18 మంది మృతితో విషాదం

పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో దుర్గాపూజ వేడుకలు విషాదాంతమయ్యాయి. శనివారం సాయంత్రం గిరీష్ పార్క్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శారదా పార్క్ (చోర్‌బాగాన్) పూజా మండపం నిష్క్రమణ ద్వారం వద్ద తొక్కిసలాట జరిగి 18 మంది ప్రాణాలు కోల్పోయారు.



3లో..

మరో లెవల్‌కు ఓట్ల పోరు

కాంగ్రెస్ భారీ కార్యాచరణ!
సర్ పోరుకు 208 మంది టీమ్
క్షేత్రస్థాయిలో దేశమంతా ప్రచారం
ఓటర్లకు అండగా నిలిచేలా ప్లాన్



2లో..

ఎస్ఐఆర్‌లో అక్రమాలు

జాబితాల సవరణపై అనుమానాలు
డైవర్షన్ రాజకీయాలంటూ విమర్శలు
ఓట్ల తొలగింపుపై బీజేపీ కుట్ర: మహేశ్ గౌడ్

ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితాల సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పారదర్శకత లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఈ ప్రక్రియలో తనకు కూడా నోటీసు వచ్చిందని వెల్లడించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. (వివరాలు 2లో..)

భూవివాదాలకు చెక్..
3 దశల్లో భూసర్వే

- 2,720 గ్రామాల్లో సమగ్ర రీసర్వేకు శ్రీకారం
- 285 గ్రామాల్లో పూర్తి.. మరో 400 రోవర్లు సిద్ధం
- భూహద్దులకు స్పష్టత.. హక్కులకు భరోసా

రాష్ట్రంలోని 10,954 రెవెన్యూ గ్రామాలకు గాను, హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల్లో తొలిదశలో 2,720 గ్రామాలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 285 గ్రామాల్లో సర్వే పూర్తిచేసి, భూయజమానుల అభ్యంతరాల స్వీకరణకు నోటీసులు జారీ చేశారు. వచ్చే నెలాఖరులోగా తొలిదశను పూర్తి చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఆధునిక సాంకేతికతతో కచ్చితమైన కొలతలు

అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ 1936 నాటి నిజాం కాలం సర్వేరికార్డులే ఆధారంగా ఉన్నాయని మంత్రి వివరించారు. భూముల విభజనలు, సర్వే నంబర్ల ఉపవిభాగాలు, పట్టణీకరణ విస్తరణతో హద్దుల విషయంలో సమస్యలు పెరిగాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితికి పరిష్కారంగా డీజీపీఎస్, రోవర్లు, జీఐఎస్, క్యూజీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. ఇప్పటికే 411 రోవర్లను కొనుగోలు చేయగా, మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారయ్యాయి. సర్వే ద్వారా సేకరించిన సమాచారాన్ని డిజిటల్ రూపంలో భద్రపరిచి, భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయనున్నారు. 1948 నాటికి తెలంగాణ ప్రాంతంలో సుమారు 40 లక్షల సర్వే నంబర్లు ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 2.29 కోట్లకు చేరిందని మంత్రి తెలిపారు. దశలవారీగా ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ గుర్తింపు ఇవ్వనున్నారు.



పాలేరులో భూదార్ పట్టాల పంపిణీ

రీసర్వే పూర్తయిన భూములకు ప్రత్యేక పటాలు రూపొందించి, ప్రతి భూకమతానికి స్పష్టమైన సరిహద్దులు నిర్ధారించనున్నారు. దీంతో భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ల సమయంలో ఎదురయ్యే సమస్యలు తగ్గుతాయని ప్రభుత్వం భావిస్తోంది. మంత్రి పొంగులేటి సొంత నియోజకవర్గమైన పాలేరులోని నేలకొండపల్లి మండలం కొంగర గ్రామ పరిధిలో 665 ఎకరాల్లో వందశాతం రీసర్వే పూర్తయింది. త్వరలో అక్కడ భూదార్ పట్టాల పంపిణీ చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రతి భూమికి ఆధార్ తరహాలో ప్రత్యేక గుర్తింపు కల్పించడం ద్వారా యాజమాన్య వివరాలను సులభంగా గుర్తించేందుకు అవకాశం ఏర్పడుతుంది. భవిష్యత్తులో భూముల హద్దులపై వివాదాలు తలెత్తకుండా డిజిటల్ రికార్డులు కీలకంగా మారనున్నాయి.

సర్వేలో పారదర్శకతే ప్రధాన లక్ష్యం

భూసర్వేకు వెళ్లే ముందు పట్టాదారులకు తప్పనిసరిగా ముందస్తు నోటీసులు ఇవ్వాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సర్వేకు ఒకటి రెండు రోజుల ముందు గ్రామాల్లో చాటింపు చేయాలని సూచించారు. ప్రభుత్వ భూములకు స్పష్టమైన గుర్తులు వేయడంతో పాటు, గ్రామకంఠం హద్దులను నిర్ధారించిన తర్వాతే సర్వే చేపట్టాలనిస్పష్టం చేశారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో భూయజమానుల అభ్యంతరాలను నిబంధనల ప్రకారం స్వీకరించి, పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, వారి సంతృప్తికి ప్రాధాన్యమిస్తూ సర్వే నిర్వహించాలి అని స్పష్టం చేశారు. భూసర్వేను కేవలం ప్రభుత్వ విధిగా కాకుండా, ప్రజల జీవితాలను ప్రభావితం చేసే కీలక బాధ్యతగా అధికారులు గుర్తించాలని పిలుపునిచ్చారు. సమన్వయంతో పనిచేసి నిర్దిష్ట గడువులో లక్ష్యాలను సాధించాలని సూచించారు.

విద్యుత్, నీటిని పొదుపుగా వాడండి

- యువ దర్శకులారా కదలండి!
- ప్రజల్లో చైతన్య కలిగించండి
- యువ దర్శకులకు భట్టి పిలుపు



విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించుకోవడంపై ప్రజల్లో అవగాహన పెంచాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క యువ దర్శకులకు పిలుపునిచ్చారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి సంక్షోభం వంటి అంశాలపై ఆకట్టుకునే కథలతో లఘు చిత్రాలు రూపొందించాలని సూచించారు. వినోదంతో పాటు సమాజానికి ఉపయోగపడే సందేశాలను అందించినప్పుడే సినిమాకు నిజమైన ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో జరిగిన బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్ ఛాలెంజ్ అవార్డ్స్-2026 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యువతస్పజనాత్మకతను అభినందిస్తూ, చిన్న చిత్రాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు.

హైదరాబాద్.. భారతీయ సినిమాకు ప్రధాన కేంద్రం

హైదరాబాద్‌ను భారతీయ సినిమా పరిశ్రమకు ప్రధాన కూడలిగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో తెలంగాణలో సినీ రంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తెలంగాణ యువతలో అపారమైన సృజనాత్మకప్రతిభ ఉందని, వారికి సరైన అవకాశాలు కల్పిస్తే జాతీయ స్థాయిలో రాణించగలరని పేర్కొన్నారు. మూడుగంటల సినిమాలో చెప్పే కథను రెండుమూడు నిమిషాల షార్ట్‌ఫిల్మ్‌లో చెప్పడం కూడా గొప్ప సృజనాత్మకతేనని ప్రశంసించారు. ఈ పోటీలో అవార్డులు రానివారు నిరుత్సాహపడకుండా తమ ప్రయత్నాలను కొనసాగించాలని సూచించారు. 29 అవార్డుల ద్వారా యువ ప్రతిభను గుర్తించడం అభినందనీయమని తెలిపారు.

బతుకమ్మలో సామాజిక సమానత్వ సందేశం

బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. వివిధ రంగుల పూలు ఒకచోట చేరినట్లుగా భిన్న వర్గాల ప్రజలను ఏకం చేసే పండుగగా బతుకమ్మను అభివర్ణించారు. ఇది సామాజిక న్యాయం, సమానత్వానికి ప్రతిరూపమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో వాతావరణ మార్పులు, సూపర్ ఎల్‌నినో ప్రభావాలు, వర్షపాతంలో మార్పులు ప్రజల జీవితాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించారు. నీటి వనరుల సంరక్షణ, వర్షపు నీటి వినియోగం, ప్రకృతి పరిరక్షణపై ప్రజలకు అర్థమయ్యే కథలతో షార్ట్‌ఫిల్మ్‌లు రూపొందించాలని యువ దర్శకులను కోరారు. విద్యుత్ పొదుపు, నీటి సంరక్షణను ప్రజల బాధ్యతగా మార్చడంలో కళాకారులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. యువ ప్రతిభను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు.

నీటి హక్కులకు ద్రోహం

- ఏపీలో లేని కరువు తెలంగాణాలోనా?
- రేవంత్ సర్కారుపై హరీశ్‌రావు ఫైర్



తెలంగాణ నీటి హక్కులను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం నుంచినదుల అనుసంధానం చేపట్టాలని కేంద్రానికి లేఖ రాయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ నుంచి నదుల అనుసంధానానికి ప్రతిపాదన ముందుకు వెళ్లిందని గుర్తుచేస్తూ, ఇప్పుడు మార్గాన్ని మార్చే ప్రయత్నాలు ఎందుకని ప్రశ్నించారు. పోలవరం నుంచి నీటిని తరలించి బొల్లేపల్లి రిజర్వాయర్‌ను నింపుకుంటే తెలంగాణ ప్రయోజనాల పరిస్థితి ఏమిటని నిలదీశారు. తెలంగాణ నీటి హక్కులకు భంగం కలిగితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఇతర రాష్ట్రాలపై తమకు ద్వేషం లేదని, తెలంగాణకు అన్యాయం జరిగితే మాత్రం గట్టిగా పోరాడతామని స్పష్టం చేశారు.

17 మంది ఎంపీలు ఎందుకు మౌనం?

తెలంగాణ నీటిప్రయోజనాలపై కీలక పరిణామాలు జరుగుతున్నా రాష్ట్రానికి చెందిన 17 మంది ఎంపీలు ఎందుకు స్పందించడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. నీటి హక్కుల విషయంలో కాంగ్రెస్ ఎంపీలు ఇప్పటికైనా కేంద్రం ముందు తమ వాదన వినిపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో పార్టీ రాజకీయాలను పక్కనపెట్టి అందరూ కలిసికట్టుగా నిలబడాలని కోరారు. రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటాను కాపాడటంలో ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు.

ప్రాజెక్టులపై నిర్లక్ష్యాన్ని నిరూపిస్తా

నీళ్లను కొనలేమంటూ మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం, అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకోవడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందని హరీశ్‌రావు నిలదీశారు. కన్నెపల్లి, దేవాదుల, కల్వకుర్తి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఆధారాలతో సహా బయటపెడతానని సవాల్ విసిరారు. తెలంగాణ నీటి ప్రయోజనాలకు నష్టం జరిగితే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రాష్ట్ర హక్కులను కాపాడటంలో విఫలమైతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని హరీశ్‌రావు స్పష్టం చేశారు.



సొంతూళ్లకు జనం..
నగరంలో రద్దీ

- దసరా రద్దీతో హైదరాబాద్ ఉక్కిరిబిక్కిరి!
- పండుగ వేళ హైవేలపై వాహనాల బారులు
- టోల్ ప్లాజాల వద్ద గంటల తరబడి నిరీక్షణ

దసరా పండుగ వేళ సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో హైదరాబాద్ నగరం కిక్కిరిసిపోయింది. శనివారం ఉదయం నుంచే ప్రధాన రహదారులు, బస్టాండ్లు ప్రయాణికులతో రద్దీగా మారాయి. మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్), జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్), దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్లలో ప్రయాణికుల తాకిడి భారీగా పెరిగింది. మహిళలు, పిల్లలు పెద్దసంఖ్యలో బస్సులు ఎక్కేందుకు వేచి ఉన్నారు. ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అదనపు బస్సులను నడిపినా, బస్టాండ్ల పరిసరాల్లో రద్దీ తగ్గలేదు. మరోవైపు ప్రైవేటు వాహనాలు, కార్లు, ఇతర వాహనాలు పెద్ద సంఖ్యలో రోడ్లపైకి రావడంతో నగరం నుంచి జిల్లాలకు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్ నెమ్మదించింది. వారాంతం కావడంతో దసరా ప్రయాణాల రద్దీ మరింత పెరిగింది. ఆదివారం కూడా ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

విజయవాడ హైవేపై వాహనాల నిలిపివేత

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-65)పై వాహనాల రాకపోకలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. నల్గొండ జిల్లా పరిధిలోని చౌటుప్పల్ ప్రాంతంలో ఫ్లైఓవర్, సర్వీస్ రోడ్డు పనులు నెమ్మదిగా సాగుతుండటంతో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమైంది. పంతంగి టోల్ ప్లాజా వద్దకార్లు సహా వాహనాలు భారీగా బారులు తీరాయి. చౌటుప్పల్, బొమ్రాలగూడెం పరిసరాల్లో వాహనాలు ముందుకు కదలక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొందరు గంటకు పైగా ట్రాఫిక్‌లో చిక్కుకున్నట్లు సమాచారం. రద్దీని నియంత్రించేందుకు ట్రాఫిక్ సిబ్బంది, హైవే పెట్రోలింగ్ బృందాలు తగినంతగా కనిపించడం లేదని పలువురు వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణ పనులు, పండుగ ప్రయాణాల కలయికతో విజయవాడ మార్గంలో వాహనాల రాకపోకలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

ఇతర మార్గాల్లోనూ తప్పని తిప్పలు

హైదరాబాద్-వరంగల్, హైదరాబాద్-కరీంనగర్, హైదరాబాద్-కర్నూలు జాతీయ రహదారులపైనా వాహనాల రద్దీ పెరిగింది. యాదాద్రి టోల్ ప్లాజా వద్ద వరంగల్ వైపు వెళ్లే వాహనాలు నెమ్మదిగా కదిలాయి. హైదరాబాద్-కర్నూలు మార్గంలోని రాయికల్ టోల్ ప్లాజా వద్ద కూడా వాహనాలు బారులు తీరాయి. బాలానగర్ వద్ద కొనసాగుతున్న రహదారి పనుల ప్రభావంతో జడ్చర్ల వైపు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ), టోల్ నిర్వహణ సిబ్బంది రద్దీని నియంత్రించేందుకు చర్యలు చేపట్టినా, వాహనాల సంఖ్య అధికంగా ఉండటంతో సమస్య కొనసాగింది. దసరా ప్రయాణికులు రద్దీని దృష్టిలోపెట్టుకొని ముందుగానే బయలుదేరాలని, అదనపు ప్రయాణ సమయాన్ని కేటాయించుకోవాలని సూచించే పరిస్థితి నెలకొంది. పండుగ వేళ సొంతూళ్లకు చేరుకునేందుకు ప్రజలు ట్రాఫిక్ కష్టాలను ఎదుర్కొంటున్నారు.

ఎస్ఐఆర్‌లో అక్రమాలు

- జాబితాల సవరణపై అనుమానాలు
- డైవర్షన్ రాజకీయాలంటూ విమర్శలు
- ఓట్ల తొలగింపుపై బీజేపీ కుట్ర: మహేశ్ గౌడ్



ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితాల సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పారదర్శకత లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఈప్రక్రియలో తనకు కూడా నోటీసు వచ్చిందని వెల్లడించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మరణించిన వారి పేర్లు తొలగించాలి, ప్రాంతం మారినవారి ఓటును కొత్త చిరునామాకు బదిలీ చేయాలి అని పేర్కొన్నారు. అయితే, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి నచ్చని ఓటర్లను లక్ష్యంగా చేసుకుని పేర్లు తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఓటరు జాబితాల సవరణ నిబంధనలను పక్కనపెట్టి వ్యవహరించడం ప్రజాస్వామ్యానికిమంచిది కాదని వ్యాఖ్యానించారు.

ఎన్నికల సంఘం స్వతంత్రతపై ప్రశ్నలు

ఎస్ఐఆర్ ప్రక్రియలో జరుగుతున్న పరిణామాలపై స్పష్టత ఇవ్వాలని మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా పనిచేస్తోందా లేదా అనే సందేహాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. స్వతంత్ర సంస్థలను బీజేపీ తనరాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటోందని విమర్శించారు. ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకు బీజేపీ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు ఉండేలా చూడటం ఎన్నికల సంఘం బాధ్యత అని స్పష్టం చేశారు. ఓటరు జాబితాల సవరణలో పారదర్శకత పాటించాలని, ఎలాంటి రాజకీయ పక్షపాతానికి తావులేకుండా అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడాలని కోరారు.

మరో లెవల్‌కు ఓట్ల పోరు

- కాంగ్రెస్ భారీ కార్యాచరణ!
- సర్ పోరుకు 208 మంది టీమ్
- క్షేత్రస్థాయిలో దేశమంతా ప్రచారం
- ఓటర్లకు అండగా నిలిచేలా ప్లాన్



ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తోంది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా కొనసాగుతున్న 'ఓట్ బచావో.. దేశ్ బచావో' ప్రచారాన్ని పర్యవేక్షించేందుకు 208 మంది పార్టీ నాయకులను పరిశీలకులుగా నియమించింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదించిన ఈ నియామకాలను శుక్రవారం రాత్రి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. సీనియర్ నాయకులు అధిర్ రంజన్ చౌధురి, అవినాశ్ పాండే, పృథ్వీరాజ్ చవాన్, నానా పటోలే, కేఎస్ సురేశ్, అశోక్ తన్వర్, అజయ్ కుమార్ తదితరులకు ఈ బాధ్యతలు అప్పగించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో సమన్వయం పెంచి ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం ఈ నియామకాల ప్రధాన లక్ష్యం.

బూత్ స్థాయిలో ప్రచారానికి పదును

అక్టోబర్ 10న ప్రారంభమైన ప్రచారాన్ని వివిధ జిల్లాల సమూహాల్లో పర్యవేక్షిస్తూ, రాష్ట్ర కాంగ్రెస్ విభాగాలతోకలిసి పరిశీలకులు పనిచేయనున్నారు. బూత్ స్థాయిలో కార్యకర్తలను సమీకరించడం, పార్టీ సంస్థాగత లోపాలను గుర్తించి సరిదిద్దడం, ఓటర్లకు చేరువ కావడం వంటి బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ఇప్పటికేపలు కార్యక్రమాలకు రూపకల్పన చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలన్న డిమాండ్‌ను కూడా ముందుకు తెస్తోంది. అక్టోబర్ 5న ఖర్గే అధ్యక్షతన, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొన్న సమావేశంలో తదుపరి కార్యాచరణను ప్రకటించారు. పార్టీ కేంద్ర నాయకత్వం నుంచి క్షేత్రస్థాయి శ్రేణుల వరకు ఒకే దిశలో పనిచేసేలా తాజా నియామకాలు చేపట్టారు.

తొలగించిన ఓటర్ల పేర్లపై ప్రత్యేక దృష్టి

ఓటరు జాబితాల నుంచి పేర్లు తొలగించబడినట్లు చెబుతున్న 13.3 కోట్లకు పైగా ఓటర్లను సంప్రదించాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుంది. అన్యాయంగా పేర్లుతొలగించారని భావిస్తున్నవారిని గుర్తించి, తిరిగి ఓటరు జాబితాలో చేరేందుకు సహకరించే బాధ్యతను బూత్ స్థాయి ప్రతినిధులకు అప్పగించింది. వీరిని 'ఓట్ రక్షక్'లుగా పిలుస్తోంది. ఓటు హక్కు పరిరక్షణ కోసం గ్రామాలు, బ్లాక్ స్థాయిల్లో ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఓటర్లలో అవగాహన పెంచడంతో పాటు, పేర్ల తొలగింపుపై ఫిర్యాదులు చేసేందుకు అవసరమైన సహకారం అందించనుంది. ఈ సమస్య కేవలం రాజకీయ అంశం కాదని, పౌరుల రాజ్యాంగ హక్కుకు సంబంధించినదని కాంగ్రెస్ వాదిస్తోంది.

ఎస్ఐఆర్‌పై పోరును విస్తరించే వ్యూహం

పరిశీలకుల నియామకాలతో దేశవ్యాప్తంగా ప్రచారాన్ని మరింత విస్తరించాలని కాంగ్రెస్ భావిస్తోంది. రాష్ట్రాలు, జిల్లాలు, బూత్ స్థాయిల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసి, ఓటర్ల సమస్యలను నేరుగా తెలుసుకోవడంపై దృష్టి పెట్టనుంది. ఎస్ఐఆర్ వల్ల ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందన్నది కాంగ్రెస్ ప్రధాన ఆరోపణ. మరోవైపు, ఓటరు జాబితాల సవరణపై ఎన్నికల ప్రక్రియలో కొనసాగుతున్న వివాదం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. 208 మంది పరిశీలకుల నియామకం ద్వారా ఉద్యమానికి క్షేత్రస్థాయి బలం పెంచి, ఓటర్లను సమీకరించాలన్నది కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది.

రూ.15 కోట్లకు కిడ్నాప్!
పోలీసుల వేషంలో మోసం

- రియల్ ఎస్టేట్ కక్షతో వ్యాపారి అపహరణ
- పది మంది అరెస్టు.. రూ.1.07 కోట్లు స్వాధీనం

హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వివాదం ఓ నగల వ్యాపారిని కిడ్నాప్ చేసే వరకు వెళ్లింది. పోలీసులమంటూ వచ్చి, నకిలీ నంబర్ ప్లేట్ల వాహనాలతో చుట్టుముట్టి, 53 ఏళ్ల కే. శ్రీనివాసరావును అపహరించిన 12 మంది ముఠా చివరకు పోలీసులకు చిక్కింది. అక్టోబర్ 5న రామంతాపూర్‌లోని తన దుకాణానికి వెళ్తున్న శ్రీనివాసరావును గోల్నాక ఫ్లైఓవర్ సమీపంలో అడ్డగించిన నిందితులు కళ్లకు గంతలు కట్టి గుర్తుతెలియని ప్రాంతానికి తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులను సంప్రదించి తొలుత రూ.15 కోట్ల విమోచన సొమ్ము డిమాండ్ చేశారు. చివరకు రూ.1.30 కోట్లకు ఒప్పందం కుదరడంతో కుటుంబం ఆ మొత్తాన్ని చెల్లించింది. అనంతరం వ్యాపారిని విడిచిపెట్టారు. ఆయన కనిపించడం లేదని బంధువులు చిక్కడపల్లి పోలీసులను ఆశ్రయించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. వ్యాపారిని సురక్షితంగా విడిపించడంతో పాటు నిందితులను పట్టుకునేందుకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

రియల్ ఎస్టేట్ గొడవే కిడ్నాప్‌కు కారణం

సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత మూర్తి వెల్లడించిన వివరాల ప్రకారం, బోడుప్పల్‌లోని హేమానగర్ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సంబంధించి శ్రీనివాసరావుకు, నిర్మాణ రంగంలో ఉన్న ప్రధాన నిందితుడు దుమావత్ శ్రీకాంత్‌కు మధ్య వివాదం ఉంది. ఈ కక్షతో శ్రీకాంత్ ఆగస్టులోనే గుంజపోగు సురేశ్ అలియాస్ సూర్యతో కలిసి అపహరణకు ప్రణాళిక రచించినట్లు పోలీసులు తెలిపారు. డబ్బు వసూలు చేయడంతో పాటు వివాదాస్పద స్థిరాస్తిపై తన పేరుతో విక్రయ ఒప్పందం, జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (ఏజీపీఏ) పొందాలన్నది కూడా కుట్రలో భాగమని పేర్కొన్నారు. పోలీసుల వేషంలో బాధితుడిని అడ్డుకోవడం, నకిలీ నంబర్ ప్లేట్లు ఉపయోగించడం, పోలీసులకు చిక్కకుండా వాహనాలను పదేపదే మార్చడం వంటి పద్ధతులను ముఠా అనుసరించినట్లు దర్యాప్తులో గుర్తించారు. చిక్కడపల్లి పోలీసులు, సికింద్రాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా పది మందిని అరెస్టు చేశారు.

రూ.1.07 కోట్లు స్వాధీనం.. ఇద్దరి కోసం గాలింపు

అరెస్టయిన వారిలో శ్రీకాంత్, సురేశ్‌తో పాటు గూడెం శ్రవణ్‌కుమార్, బండారి శాంసన్, బురాని ధన్‌సింగ్, సర్దార్ కుల్దీప్‌సింగ్, బౌరి భీమ్‌సింగ్, హీరాసింగ్, సర్దార్ గోవిన్‌సింగ్, రామగళ్ల ప్రసాద్ ఉన్నారు. నిందితుల నుంచి రూ.1.07 కోట్ల నగదు, 118.26 గ్రాముల బంగారు ఆభరణాలు, తొమ్మిది మొబైల్ ఫోన్లు, ఐదు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో బొలెరో, ఎర్టిగా, కియా సెల్టోస్ కార్లతో పాటు బైక్, స్కూటర్ ఉన్నాయి. ప్రధాన నిందితుడు శ్రీకాంత్‌పై గతంలో ఇళ్ల మోసాలకు సంబంధించి 16 కేసులు ఉన్నాయని, సురేశ్‌పై దొంగతనం, దోపిడీ, బెదిరింపులు, కిడ్నాప్ కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. శాంసన్‌పై కూడా ఐదు ఆస్తి సంబంధిత నేరాల కేసులు ఉన్నట్లు వెల్లడించారు. మరో ఇద్దరు నిందితులు శ్రీనివాసరెడ్డి, వికాస్ పరారీలో ఉన్నారు. మిగిలిన విమోచన సొమ్మును స్వాధీనం చేసుకోవడంతో పాటు పరారీలో ఉన్నవారిని పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తున్నారు.

హైదరాబాద్‌కు వాన

- నేడు కూడా కురిసే ఛాన్స్
- ఎండల నుంచి ఉపశమనం




హైదరాబాద్ నగరవాసులకు వాతావరణం నుంచి ఊరట లభించే సూచనలు కనిపిస్తున్నాయి. శనివారం రాత్రి ఫ్యూచర్ సిటీతో పాటు నగర పరిసర ప్రాంతాల్లో పలుచోట్ల వర్షం కురిసింది. యాదాద్రి భువనగిరి, చౌటుప్పల్ పరిసరాల్లో ఏర్పడిన ఉరుములు, మెరుపులతో కూడిన వర్ష మేఘాలు రంగారెడ్డి జిల్లా వైపు కదులుతున్నట్లు వాతావరణ సమాచారం సూచిస్తోంది. కొన్నిప్రాంతాల్లో వర్షంతో రోడ్లపై నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారత వాతావరణ శాఖ అంచనా ప్రకారం అక్టోబర్ 18, ఆదివారం హైదరాబాద్‌లో అక్కడక్కడా వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. దీంతో వాన కోసం ఎదురుచూస్తున్న నగరవాసుల్లో ఆశలు పెరుగుతున్నాయి.

నేడు వానకు అవకాశాలు

తెలంగాణలోకి తూర్పు గాలులు ప్రవేశించడంతో దక్షిణ, తూర్పు జిల్లాల్లో వర్ష కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి. హైదరాబాద్‌లో ఆదివారం వర్షాలు, ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని స్థానిక వాతావరణ నివేదిక పేర్కొంది. ఇప్పటికే కురిసిన వానకు రేపటి వర్ష సూచనలు తోడైతే నగరానికి మరింత ఉపశమనం లభించవచ్చు. అయితే భారీ వర్షం ఖాయమని భావించకుండా, తాజా వాతావరణ హెచ్చరికలను గమనించాలి. ఉరుములు, మెరుపుల సమయంలో చెట్ల కింద, హోర్డింగుల సమీపంలో నిలబడకూడదు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

ఎల్‌కే అద్వానీకి ఛాతీ ఇన్ఫెక్షన్!

- 98 ఏళ్ల నేతకు ఐసీయూలో చికిత్స
- నడ్డా పరామర్శ.. నిలకడగా ఆరోగ్యం



భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సీనియర్ నేత, మాజీ ఉప ప్రధానమంత్రి లాల్‌కృష్ణ అద్వానీ అనారోగ్యానికి గురయ్యారు. ఛాతీలో ఇన్ఫెక్షన్ కారణంగా ఆయనను శుక్రవారం రాత్రి ఢిల్లీలోని అపోలో ఆసుపత్రిలో చేర్చారు. 98 ఏళ్ల అద్వానీ రాత్రి సుమారు 7.30 గంటలకు ఆసుపత్రికి చేరుకోగా, వైద్యులు వెంటనే చికిత్స ప్రారంభించారు. దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన అద్వానీ ఆసుపత్రిలో చేరారన్న వార్తతో బీజేపీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకునేందుకు పార్టీ నాయకులు ఆసక్తి చూపుతున్నారు.

ఐసీయూలో వైద్యుల పర్యవేక్షణ

అద్వానీ ఆరోగ్య పరిస్థితిపై అపోలో ఆసుపత్రి అక్టోబర్ 17, శనివారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఛాతీలో ఇన్ఫెక్షన్‌తో ఆసుపత్రిలో చేరిన ఆయన ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్నారని వెల్లడించింది. సీనియర్ న్యూరాలజీ కన్సల్టెంట్ డాక్టర్ వినీత్ సూరి పర్యవేక్షణలో వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తోందని స్పష్టం చేసింది. వయసు దృష్ట్యా అద్వానీ ఆరోగ్యంపై వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఆసుపత్రి ప్రకటనతో ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలకు కొంత ఊరట లభించింది.

పరామర్శించిన జేపీ నడ్డా

కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు జేపీ నడ్డా శనివారం ఉదయం 9.30 గంటలకు అపోలో ఆసుపత్రికి వెళ్లి అద్వానీని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అద్వానీ ఆరోగ్యం నిలకడగా ఉందని నడ్డా వెల్లడించారు. దేశ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన అద్వానీ బీజేపీ ఎదుగుదలలో కీలక పాత్ర పోషించారు. ఉప ప్రధానమంత్రిగా దేశానికి సేవలందించిన ఆయన ఆరోగ్య పరిస్థితిపై ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణ కొనసాగుతోంది. ప్రస్తుత పరిస్థితి నిలకడగా ఉండటం ఊరటనిచ్చే అంశం. వైద్యుల పరిశీలన అనంతరం ఆయన ఆరోగ్యంపై తదుపరి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

సీజేపీ చీఫ్‌కు రిలీఫ్

- విడుదలకు కోర్టు ఆదేశాలు
- తిరంగా మార్చ్ వేళ అరెస్టు



ఎన్నికల అక్రమాలపై నిరసనల్లో భాగంగా ఢిల్లీలో తిరంగా మార్చ్ నిర్వహించేందుకు సిద్ధమైన కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేకు ఊరట లభించింది. శుక్రవారం అదుపులోకి తీసుకుని, అనంతరం అరెస్టు చేసిన ఆయనను శనివారం కోర్టు ఆదేశాలతో షరతులతో విడుదల చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించబోనని హామీ ఇస్తూ రూ.50 వేల బాండ్ సమర్పించాలని మేజిస్ట్రేట్ ఆదేశించినట్లు సమాచారం. విచారణ అనంతరం మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్ నుంచి ఆయన బయటకు వచ్చారు. విడుదలపై ఎక్స్‌లో స్పందించిన దీప్కే, 24 గంటలపాటు ఫోన్, వైఫై లేకుండా జైలులో గడిపి బయటకు వచ్చిన అనుభూతిని షారుఖ్ ఖాన్ 'వీర్‌జారా' సినిమా దృశ్యంతో పోలుస్తూ పోస్టు చేశారు.

తిరంగా మార్చ్‌కు ముందే నిర్బంధం

శుక్రవారం సాయంత్రం ఢిల్లీలోని కనాట్ ప్లేస్‌లో 'లెహ్రా దో తిరంగా' పేరుతో జాతీయ జెండా ప్రదర్శన చేపట్టాలని నిరసనకారులు భావించారు. ఎన్నికల అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై కొనసాగుతున్న ఆందోళనల్లో భాగంగా ఈ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. అయితే, శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్యలను నివారించేందుకు అభిజీత్ దీప్కే, అఖిల భారత విద్యార్థి సంఘం (ఏఐఎస్ఏ) అధ్యక్షురాలు నేహా బోరాను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. నేహా బోరాను శనివారం తెల్లవారుజామున విడుదల చేయగా, దీప్కేపై శాంతిభద్రతలకు భంగం కలిగించే అవకాశం ఉందన్న ఆరోపణలతో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్లు 126, 170 కింద కేసు నమోదు చేశారు. అయినప్పటికీ, విద్యార్థులు, ఇతర నిరసనకారులు జాతీయ జెండాలతో ర్యాలీలు నిర్వహించారు.

పోలీసుల తీరుపై నేహా బోరా ఆగ్రహం

విడుదలైన నేహా బోరా పోలీసుల చర్యలను తప్పుబట్టారు. తమ నిర్బంధం చట్టవిరుద్ధమని ఆరోపిస్తూ, ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. నిరసనల్లో అరెస్టైన అభిజీత్ దీప్కేతో సహా అందరినీ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు, జంతర్ మంతర్ వద్ద అనధికార ప్రవేశానికి సంబంధించిన కేసులో సీజేపీ నాయకులు ఆశుతోష్ రంకా, సౌరవ్ దాస్ న్యాయ నిర్బంధంలో ఉన్నారు. గతంలో అక్టోబర్ 10న ఢిల్లీ విమానాశ్రయంలో దీప్కేను అదుపులోకి తీసుకున్నప్పుడు కూడా శాంతిభద్రతలకు సంబంధించిన కేసు నమోదైంది.

150 మందికి పైగా నిర్బంధం

శుక్రవారం శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం సుమారు 150 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కనాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్ చుట్టూ భద్రతను కట్టుదిట్టం చేసి, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందిని మోహరించారు. మరోవైపు, ఎన్నికల సంఘం తన నిర్ణయాలకు సుప్రీంకోర్టు ఆమోదం ఉందని చెబుతోంది. ప్రతిపక్షాలు, సీజేపీ, విద్యార్థి సంఘాలు చేపడుతున్న నిరసనలను బీజేపీ విదేశీ నిధులతో నడుస్తున్న ఆందోళనలుగా అభివర్ణిస్తూ, అశాంతిని సృష్టించే ప్రయత్నమని విమర్శిస్తోంది. ఈ పరిణామాలతో ఎన్నికల ప్రక్రియపై వివాదం, నిరసనకారుల నిర్బంధం, పోలీసుల చర్యలు ఢిల్లీలో రాజకీయ చర్చకు కేంద్రంగా మారాయి.

ప్రజలను భయపెట్టి వైసీపీ సాధించేదేమిటి?



పులివెందులలో జరిగిన ఘటన ప్రజాస్వామ్యానికి చీకటి రోజని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ విమర్శించారు. శనివారం తెనాలిలో మీడియాతో మాట్లాడుతూ, అల్లర్లు, అలజడులు సృష్టించి ప్రజలను భయాందోళనలకు గురిచేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం వైసీపీ మూర్ఖత్వమని వ్యాఖ్యానించారు. గత ఐదేళ్ల పాలనలో ప్రజలను భయపెట్టిన పంథానే ఇప్పటికీ కొనసాగిస్తోందని ఆరోపించారు. పులివెందులలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎన్నికలు పూర్తిగా ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలని, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా శాంతియుత వాతావరణం ఉండాలని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో భయాన్ని పెంచడం సరికాదని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో అన్ని పార్టీలు సంయమనం పాటించాలని, ప్రజలు స్వేచ్ఛగా తమ ప్రజాస్వామ్య హక్కులను వినియోగించుకునేలా చూడాలని మనోహర్ కోరారు.

నామినేషన్ల వేళ మహిళలపై దాడులు



స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా మహిళా అభ్యర్థులపై దాడులు జరిగినట్లు వైఎస్సార్‌సీపీ ఆరోపించింది. ఎమ్మార్వల్లిలోని 12వ వార్డుకు నామినేషన్ వేసేందుకు వెళ్లిన అభ్యర్థి మవితపై దాడి జరగగా, 15వ వార్డు కార్యాలయం సమీపంలో స్వర్ణ, పావనిలపై కూడా దాడి జరిగినట్లు తెలిపింది. టీడీపీ కార్యకర్తలు అడ్డుకుని పిడిగుద్దులు గుప్పించడంతో పాటు దుస్తులు చించేశారని బాధితులు ఆరోపించారు. ఘటనను వివరిస్తూ మహిళా అభ్యర్థులు కన్నీటిపర్యంతమయ్యారు. అక్కడే పోలీసులు ఉన్నా తమకు రక్షణ కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీకి పోలీసులు అండగా ఉంటున్నారని వైఎస్సార్‌సీపీ విమర్శించింది. అభ్యర్థులను అడ్డుకోవడం, మహిళలపై దాడులపై ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదని ఆరోపించింది. వందలాది ఫిర్యాదులు అందించినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని పార్టీ నేతలు మండిపడ్డారు.



పులివెందులలో ఉద్రిక్తత

- అవినాశ్‌కు ఎస్పీ హెచ్చరిక!
- బాబు, లోకేశ్‌పై ఎంపీ ఆరోపణలు

పులివెందులలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి నేతృత్వంలో భారీగా నామినేషన్ కేంద్రం వద్దకు చేరుకోవడంతో పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. అప్పటికే టీడీపీ బృందం నామినేషన్లు దాఖలు చేసేందుకు కేంద్రంలోపల ఉండటంతో, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు కొంతసేపు వేచి ఉండాలని పోలీసులు సూచించారు. దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసిన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తత పెరిగింది. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు గాల్లోకి ఆరు రౌండ్లు కాల్పులు జరిపి, స్వల్పంగా లాఠీఛార్జ్ చేశారు. దీంతో నామినేషన్ కేంద్రం పరిసరాల్లో కలకలం రేగింది.

వెళ్లకపోతే అరెస్టు చేస్తామన్న ఎస్పీ

పరిస్థితిని సమీక్షించేందుకు కడప జిల్లా ఎస్పీ నచికేత విశ్వనాథ్ షెల్కే పులివెందులకు చేరుకున్నారు. నామినేషన్ల దాఖలుకు సమయం ముగిసినందున అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఎంపీ అవినాశ్‌రెడ్డికి సూచించారు. వెళ్లకపోతే అరెస్టు చేస్తామని హెచ్చరించినట్లు సమాచారం. ఎస్పీ సూచనల నేపథ్యంలో అవినాశ్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణులను అక్కడి నుంచి వెళ్లిపోవాలని కోరారు. అనంతరం ఆయన కూడా అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇదే సమయంలో మైదుకూరులో టీడీపీ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పరస్పరం రాళ్లు రువ్వుకోవడంతో ఎస్పీ అక్కడికి వెళ్లి పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్ బాషా, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డిని గృహ నిర్బంధంలో ఉంచినట్లు సమాచారం.

చంద్రబాబు, లోకేశ్‌పై అవినాశ్ ఆరోపణలు

ఈ పరిణామాలపై ఎంపీ అవినాశ్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు, మంత్రి నారా లోకేశ్‌పై ఆరోపణలు చేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై దాడులను ప్రోత్సహిస్తూ భయానక వాతావరణం సృష్టిస్తున్నారని, తద్వారా ప్రతిపక్ష అభ్యర్థులు ఎన్నికల పోటీ నుంచి తప్పుకునేలా ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. అయితే ఇవి అవినాశ్‌రెడ్డి చేసిన ఆరోపణలు. పులివెందులలో కాల్పులకు దారితీసిన పరిస్థితులు, ఇరుపక్షాల వాదనలపై అధికారిక విచారణలో మరిన్ని వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.


అయ్యో పాపం

- తొలి సిరీస్ విడుదలైన వేళే విషాదం!
- కలల ప్రయాణం మొదలవుతున్న వేళ
- హోటల్ గదిలో యువ దర్శకుడు బెల్రాజ్ మృతి

సినిమా ప్రపంచంలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకోవాలని కలలు కన్న యువ దర్శకుడు బెల్రాజ్ కలరికల్ జీవితం విషాదాంతమైంది. ఎన్నో రోజుల శ్రమ, ఎన్నో ఆశలతో తెరకెక్కించిన తొలి వెబ్ సిరీస్ 'కాపి స్క్వాడ్' శుక్రవారం ఓటీటీలో విడుదలైంది. తన ప్రతిభను ప్రేక్షకులు గుర్తిస్తారని, కెరీర్‌లో కొత్త అధ్యాయం మొదలవుతుందని ఆశించిన ఆయనకు మరుసటి రోజే తీరని విషాదం ఎదురైంది. ఎర్నాకులంలోని ఓ హోటల్ గదిలో ఆయన విగతజీవిగా కనిపించడం మలయాళ సినీ పరిశ్రమను దిగ్భ్రాంతికి గురిచేసింది. గతంలో పలు చిత్రాలకు అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన బెల్రాజ్‌కు స్వతంత్ర దర్శకుడిగా ఎదగాలన్నది కల. ఆ కలకు తొలి అడుగు పడిన వేళే ఆయన మరణవార్త రావడం అందరినీ కలచివేసింది.

తొలి వెబ్ సిరీస్‌తోనే విషాదాంతం

మలయాళ చిత్ర పరిశ్రమలో 'చెగు'గా గుర్తింపు పొందిన బెల్రాజ్ కలరికల్ ఎర్నాకులంలోని హోటల్ గదిలో మృతి చెందినట్లు వార్తలు వెలువడ్డాయి. ఆయన దర్శకత్వం వహించిన 'కాపి స్క్వాడ్' వెబ్ సిరీస్ జియో హాట్‌స్టార్‌లో శుక్రవారం నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. స్వతంత్ర దర్శకుడిగా ఆయనకు ఇదే తొలి ప్రయత్నం. అంతకుముందు 'నిజల్', 'మధురం', 'దాకిని' వంటి చిత్రాలకు అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేశారు. కేరళలోని కొట్టాయం జిల్లా మణిమాల ఆయన స్వస్థలం. కలరికల్ సురేశ్, స్మిత దంపతులకు ఆయన కుమారుడు. గత సెప్టెంబర్‌లో అతిరాను వివాహం చేసుకున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం గుండెపోటు కారణంగా మరణించి ఉండవచ్చని భావిస్తున్నారు. ఆయన మృతదేహాన్ని సన్‌రైజ్ ఆసుపత్రికి తరలించారు. తొలి వెబ్ సిరీస్ విడుదలతో కొత్త జీవితాన్ని ప్రారంభించాల్సిన సమయంలో బెల్రాజ్ మరణించడం సినీ వర్గాలను విషాదంలో ముంచింది.



తిరుపతిలో నామినేషన్ల రణరంగం

- ఎంపీ గురుమూర్తి నుంచి లాక్కోవడంతో ఉద్రిక్తత



తిరుపతిలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల వేళ ఉద్రిక్తత చోటుచేసుకుంది. వైఎస్సార్‌సీపీ మేయర్ అభ్యర్థి వాసు యాదవ్ తరఫున నామినేషన్ ప్రక్రియ కోసం వెళ్లిన తనను, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యాన్ని టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ఆరోపించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న నామినేషన్ కేంద్రానికి చేరుకోగా వందలాది మంది టీడీపీ నేతలు, కార్యకర్తలు చుట్టుముట్టారని తెలిపారు. వెనక్కి వెళ్లాలంటూ అడ్డుకున్నారని, ఆధార్ కార్డుతో పాటు నామినేషన్‌కు సంబంధించిన ఆధారాలు చూపించాలని పోలీసులు కోరిన సమయంలో తమ చేతుల్లోని పత్రాలను టీడీపీ కార్యకర్తలు లాక్కెళ్లారని ఆరోపించారు. ఈ పరిణామాలన్నీ జరుగుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని ఎంపీ మండిపడ్డారు.

పోలీసుల వైఫల్యమంటూ తీవ్ర విమర్శలు

నామినేషన్ కేంద్రం పరిసరాల్లో నిబంధనలు అమలు చేయాల్సిన పోలీసులే ఎంపీ, ఎమ్మెల్సీకి రక్షణ కల్పించలేకపోవడం దారుణమని గురుమూర్తి విమర్శించారు. ప్రజాప్రతినిధులు నామినేషన్ ప్రక్రియ పూర్తి చేసి సురక్షితంగా తిరిగి వెళ్లేలా చూడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి ప్రతిపక్ష నేతల ప్రజాస్వామ్య హక్కులను అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో పోలీసులు చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయకుండా అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు కలుగుతున్నాయని వ్యాఖ్యానించారు. టీడీపీ కార్యకర్తల కంటే పోలీసులే వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను ఎక్కువగా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియలో అన్ని పార్టీలకు సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

నామినేషన్ల వేళ మహిళలపై దాడులు

ఎమ్మార్వల్లిలోని 12వ వార్డుకు నామినేషన్ వేసేందుకు వెళ్లిన అభ్యర్థి మవితపై దాడి జరగగా, 15వ వార్డు కార్యాలయం సమీపంలో స్వర్ణ, పావనిలపై కూడా దాడి జరిగినట్లు తెలిపింది. టీడీపీ కార్యకర్తలు అడ్డుకుని పిడిగుద్దులు గుప్పించడంతో పాటు దుస్తులు చించేశారని బాధితులు ఆరోపించారు. ఘటనను వివరిస్తూ మహిళా అభ్యర్థులు కన్నీటిపర్యంతమయ్యారు. అక్కడే పోలీసులు ఉన్నా తమకు రక్షణ కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీకి పోలీసులు అండగా ఉంటున్నారని వైఎస్సార్‌సీపీ విమర్శించింది. అభ్యర్థులను అడ్డుకోవడం, మహిళలపై దాడులపై ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదని ఆరోపించింది. వందలాది ఫిర్యాదులు అందించినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని పార్టీ నేతలు మండిపడ్డారు.



తిరువూరులో టీడీపీ తిరుగుబాటు!

- కూటమి ధర్మానికి ఎమ్మెల్యే కొలికపూడి తూట్లు..
- సొంత అభ్యర్థి ప్రకటనతో రాజకీయ వేడి

తిరువూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి కూటమి పార్టీల మధ్య రాజకీయ చిచ్చు రేపుతోంది. మున్సిపల్ పీఠాన్ని జనసేనకు కేటాయించడంతో తెలుగుదేశం పార్టీలో అసంతృప్తి సెగలు రాజుకున్నాయి. ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సొంత అభ్యర్థిని రంగంలోకి దించడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. కూటమి నిర్ణయానికి అనుగుణంగా జనసేన పార్టీ మాధవిని చైర్‌పర్సన్ అభ్యర్థిగా ఎంపిక చేసింది. అయితే, ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న కొలికపూడి తన అభ్యర్థిగా నాగ శ్రావణిని ప్రకటించడం చర్చకు దారితీసింది. మిత్రపక్షానికి కేటాయించిన స్థానంలో మరో కూటమి పార్టీ ఎమ్మెల్యే సొంత అభ్యర్థిని ప్రకటించడమే కాకుండా, ఆమె గెలుపు కోసం పార్టీ శ్రేణులను సమీకరించే ప్రయత్నం చేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది.

కార్యకర్తలకు కొలికపూడి పిలుపు

నేడు జరగనున్న నామినేషన్ల కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ శ్రేణులన్నీ తరలిరావాలని కొలికపూడి సామాజిక మాధ్యమాల వేదికగా పిలుపునివ్వడం పరిస్థితిని మరింత వేడెక్కించింది. ఎమ్మెల్యే పిలుపుతో టీడీపీ శ్రేణులు ఏ మేరకు స్పందిస్తాయి? జనసేన అభ్యర్థికి మద్దతుగా నిలుస్తాయా? లేక కొలికపూడి ప్రకటించిన నాగ శ్రావణి వెంట నడుస్తాయా? అన్నది ఉత్కంఠ రేపుతోంది. కూటమి అధిష్ఠానం ఒక నిర్ణయం తీసుకున్న తర్వాత దానికి భిన్నంగా స్థానిక ఎమ్మెల్యే వ్యవహరించడం పార్టీ క్రమశిక్షణకు సవాలుగా మారే అవకాశముంది. మరోవైపు, జనసేనకు కేటాయించిన స్థానంలో టీడీపీ అభ్యర్థి బరిలో నిలిస్తే రెండు పార్టీల మధ్య సమన్వయం దెబ్బతినే ప్రమాదం ఉంది. నామినేషన్ ఘట్టం పూర్తయ్యేలోగా ఏదైనా సయోధ్య కుదురుతుందా? లేక రెండు పార్టీల అభ్యర్థులు పోటీలో నిలుస్తారా? అన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

ఏదో ఒక నిర్ణయం తప్పదా?

కూటమిలో సీట్ల సర్దుబాటు కేవలం రాష్ట్రస్థాయి నిర్ణయాలతోనే ముగిసిపోదని, క్షేత్రస్థాయిలో నాయకుల అంగీకారం కూడా కీలకమని తిరువూరు పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. స్థానికంగా తమ బలాన్ని నిరూపించుకోవాలనే పట్టుదల, అనుచరులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలనే ఆకాంక్షలు పొత్తుల స్ఫూర్తికి పరీక్షగా మారుతున్నాయి. ఒకవైపు జనసేనకు కేటాయించిన స్థానాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఆ పార్టీ నాయకత్వంపై ఉండగా, మరోవైపు ఎమ్మెల్యే వైఖరిని ఎలా ఎదుర్కోవాలన్నది టీడీపీ అధిష్ఠానానికి సవాలుగా మారింది. ఈ వ్యవహారంలో రాష్ట్రస్థాయి నాయకులు జోక్యం చేసుకుంటారా? కొలికపూడి తన నిర్ణయాన్ని మార్చుకుంటారా? లేక పార్టీ అధిష్ఠానం క్రమశిక్షణ చర్యలకు దిగుతుందా? అనే అంశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

నేతల తీరుపై హైకమాండ్ అంతర్మథనం

ఇదిలా ఉండగా, మరోవైపు సాలూరులోనూ కూటమి రాజకీయాల్లో అసంతృప్తి బయటపడినట్లు ప్రచారం జరుగుతోంది. టికెట్ వ్యవహారంలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి కన్నీటిపర్యంతమైనట్లు వచ్చిన సమాచారం చర్చనీయాంశమైంది. ఇలా వేర్వేరు ప్రాంతాల్లో పదవులు, అభ్యర్థుల ఎంపిక చుట్టూ అసంతృప్తి వ్యక్తమవుతుండటం కూటమి పార్టీల అంతర్గత సమన్వయంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. తిరువూరులో కొలికపూడి వ్యవహారం వ్యక్తిగత అభ్యర్థిత్వానికి సంబంధించిన వివాదంగానే మిగులుతుందా? లేక టీడీపీ-జనసేన సంబంధాలపై ప్రభావం చూపే స్థాయికి చేరుతుందా? అన్నది వేచి చూడాలి. నామినేషన్ రోజు పరిణామాలు తిరువూరు మున్సిపల్ రాజకీయాలకే కాకుండా, కూటమిలోని ఐక్యతకు కూడా పరీక్షగా నిలవనున్నాయి.

రాఘవరెడ్డి పోటీపై న్యాయపోరాటం!



ప్రొద్దుటూరు మున్సిపల్ ఎన్నికల్లో రాఘవరెడ్డికి పోటీ చేసే అవకాశం కల్పిస్తే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నేత రాచమల్లు శివప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం వైఎంఆర్ కాలనీలో పార్టీ చైర్మన్ అభ్యర్థి పోరెడ్డి నరసింహారెడ్డి నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాఘవరెడ్డి ఓటు బదిలీపై హైకోర్టు సంబంధిత రికార్డులను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సూచించిందే తప్ప, బదిలీ పూర్తయినట్లు ధ్రువీకరించలేదని రాచమల్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆయనకు పోటీ చేసే అవకాశం కల్పిస్తే హైకోర్టు, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఓటు నమోదు కోసం ఎదురుచూస్తున్న సుమారు ఆరు వేల మంది కొత్త ఓటర్లకు కూడా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తమ అభ్యంతరం వ్యక్తిగతమైనది కాదని, నిబంధనలు అందరికీ సమానంగా వర్తించాలన్నదే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చే తీర్పును గౌరవిస్తామని తెలిపారు.

టీడీపీలోకి గాండ్ల కుటుంబం చేరిక



ప్రొద్దుటూరు మున్సిపల్ ఎన్నికల వేళ టీడీపీలో చేరికలు చోటుచేసుకున్నాయి. మాజీ కౌన్సిలర్ గాండ్ల నారాయణ స్వామి కుటుంబ సభ్యులు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. శనివారం కొర్రపాడు రోడ్డులోని ఎస్కేఎస్సీ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, చైర్మన్ అభ్యర్థి నంద్యాల రాఘవ రెడ్డి, నాయకుడు నంద్యాల కొండారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. నియోజకవర్గ పరిశీలకురాలు కొండవీటి భావన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 8వ వార్డు టీడీపీ అభ్యర్థి గాండ్ల వినీతతో పాటు చైర్మన్ అభ్యర్థి రాఘవరెడ్డి విజయానికి పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. నారాయణస్వామి వార్డు అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొంటూ, ఓటర్లు సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఇద్దరినీ గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గాండ్ల సంఘం అధ్యక్షుడు నల్లం శంకర్ సహా పలువురు స్థానిక నాయకులు ఈ కార్యక్రమంలో టీడీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టీడీపీ నాయకుడు బచ్చల ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల భద్రతపై నోడల్ అధికారి ప్రత్యేక నిఘా



ప్రొద్దుటూరులో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు భద్రతా ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా స్పెషల్ నోడల్ ఆఫీసర్ వెంకటపతి స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి, అక్కడి భద్రతా పరిస్థితులను సమీక్షించారు. ఎన్నికల సామగ్రి భద్రత, నిరంతర పర్యవేక్షణ, అవసరమైన మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయడంతో పాటు భద్రతా విధుల్లో నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, క్రమబద్ధతకు ప్రాధాన్యమిస్తూ ఓటింగ్ ప్రక్రియ నుంచి ఎన్నికల సామగ్రి భద్రత వరకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

ప్రొద్దుటూరు కూటమి చైర్మన్ అభ్యర్థిగా రాఘవరెడ్డి



ప్రొద్దుటూరు మున్సిపల్ ఎన్నికల్లో కూటమి చైర్మన్ అభ్యర్థిగా నంద్యాల రాఘవరెడ్డి పేరును అధిష్ఠానం ఖరారు చేసినట్లు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రకటించారు. శనివారం మీడియా సమావేశంలో మాట్లాడు తూ, కూటమి నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపాలిటీలోని 52 వార్డుల్లో నూ కౌన్సిలర్ అభ్యర్థులను బరిలోకి దింపుతామని, గత రెండున్నరేళ్ల ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. ఓటర్లు తమ రెండు ఓట్లను కూటమి అభ్యర్థులకే వేయాలని కోరారు. రాఘవరెడ్డి మాట్లాడుతూ, తమ కుటుంబం నాలుగు దశాబ్దాలుగా ప్రజాసేవలో ఉందని, నీతి, నిజాయితీతో ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. టీడీపీ కార్యదర్శి ముక్తియార్ కూటమి అభ్యర్థిత్వానికి మద్దతు ప్రకటించారు. 19 నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తామని తెలిపారు. వైసీపీ పాలనలో అవినీతి జరిగిందన్న ఆరోపణలను ప్రజలకు వివరిస్తూ ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను ఎదుర్కొంటామని పేర్కొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యానికి చెక్!



గుంటూరు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఎన్నికల ఏర్పాట్లు, విధుల నిర్వహణపై కీలక సూచనలు చేశారు. ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు తప్పనిసరిగా శిక్షణ తరగతులకు హాజరుకావాలని స్పష్టం చేశారు. సరైన కారణం లేకుండా శిక్షణకు గైర్హాజరైన ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఎన్నికల విధులపై పూర్తి అవగాహనతో పనిచేస్తేనే పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగుతుందని పేర్కొన్నారు. ప్రతి అధికారి తనకు అప్పగించిన బాధ్యతలను జాగ్రత్తగా నిర్వర్తించాలని, ఎన్నికల ఏర్పాట్లపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రోజువారీ నివేదికలను సకాలంలో సమర్పిస్తూ, పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

వనపర్తిలో వివాదం, మహిళల ధర్నా



వనపర్తి మండలం చిమనగుంటపల్లిలో రాయితీ వేరుశనగ విత్తనాల పంపిణీ వివాదం ముదిరింది. మహిళా సంఘాలకు అందించాల్సిన విత్తనాలను నిబంధనలకు విరుద్ధంగా తరలించి, అనర్హులకు పంపిణీ చేశారంటూ సంఘాల సభ్యులు ఆందోళనకు దిగారు. అధికార పార్టీ నాయకుల ప్రమేయంతోనే ఈ వ్యవహారం జరిగిందని ఆరోపిస్తూ ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. తమకు అందాల్సిన విత్తనాలను అధికారులు స్థానిక నేతలతో కుమ్మక్కై రహస్యంగా పక్కదారి పట్టించారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన తమకు అన్యాయం జరిగిందని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న డీఆర్డీఓ అధికారులు ఆందోళన స్థలానికి చేరుకుని మహిళలతో మాట్లాడారు. విత్తనాల పంపిణీలో జరిగిన పరిణామాలపై డీఆర్డీఓ ద్వారా సమగ్ర విచారణ జరిపించి, బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు తమ ధర్నాను విరమించారు. విచారణలో ఏం తేలుతుందో, అర్హులకు న్యాయం జరుగుతుందో వేచి చూడాలి.

కోల్ కతాలో ఘోరం.. 18 మంది మృతి



దుర్గాపూజలో తొక్కిసలాటతో విషాదం

ఇరుకైన మార్గంతోనే ప్రమాదం




పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో దుర్గాపూజ వేడుకలు విషాదాంతమయ్యాయి. శనివారం సాయంత్రం గిరీష్ పార్క్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శారదా పార్క్ (చోర్‌బాగాన్) పూజా మండపం నిష్క్రమణ ద్వారం వద్ద తొక్కిసలాట జరిగి 18 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 13 మంది మహిళలు, ఒక చిన్నారి ఉన్నారు. మరో 25 మంది గాయపడగా, ఎనిమిది మంది పరిస్థితి విషమంగా ఉంది. వర్షం, భారీగా తరలివచ్చిన భక్తుల రద్దీ ఈ ఘటనకు కారణమైనట్లు పోలీసులు తెలిపారు. ఇరుకైన ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, వెలుతురు సరిగా లేకపోవడం ప్రమాద తీవ్రతను పెంచాయని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, విపత్తు నిర్వహణ బృందాలు సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించాయి. పూజా మండపాన్ని సందర్శకుల కోసం మూసివేశారు.

బాధిత కుటుంబాలకు పరిహారం

ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున తాత్కాలిక పరిహారం ప్రకటించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదివారం పశ్చిమ బెంగాల్‌లో జరగాల్సిన రాజకీయ కార్యక్రమాలను వాయిదా వేసి, బాధితులను పరామర్శించనున్నట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి సువేందు అధికారి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బాధితులకు తక్షణ వైద్యం, పరిహారం అందించాలని కోరుతూ సమగ్ర విచారణకు విజ్ఞప్తి చేశారు. మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



అమరావతి అభివృద్ధిపై
సీఎంల కీలక భేటీ

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో రాజధాని అమరావతి నిర్మాణం, రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చంద్రబాబు వివరించారు. ఏపీలో చేపడుతున్న ప్రాజెక్టులు, అభివృద్ధి ప్రణాళికల గురించి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రికి వివరించినట్లు సమాచారం. చంద్రబాబు నివాసానికి చేరుకున్న మోహన్ యాదవ్‌కు మంత్రి నారా లోకేశ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లోకేశ్ తన యువగళం పాదయాత్రకు సంబంధించిన పుస్తకాన్ని మోహన్ యాదవ్‌కు అందజేశారు. పాదయాత్రలో ఎదురైన అనుభవాలు, ప్రజల నుంచి వచ్చిన స్పందనతో పాటు యాత్రకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను ఆయనకు వివరించారు.

విశాఖ కూటమిలో టికెట్ల చిచ్చు!

టీడీపీలో అసంతృప్తి..
జనసేనలో తిరుగుబాటు
బీజేపీలో నిరాశ..
120 వార్డులకు వందల్లో ఆశావహులు



మహా విశాఖ నగరపాలక సంస్థ ఎన్నికలు కూటమి పార్టీల్లో రాజకీయ వేడిని పెంచుతున్నాయి. వార్డుల సంఖ్య 98 నుంచి 120కి పెరగడంతో టికెట్ల కోసం పోటీ తీవ్రంగా మారింది. ఏళ్ల తరబడి పార్టీని నమ్ముకుని, ప్రజల్లో తిరుగుతూ సామాజిక కార్యక్రమాలకు సొంత డబ్బు ఖర్చు చేసిన నాయకులు ఇప్పుడు అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. ఒక్కో వార్డు నుంచి ముగ్గురు, నలుగురు టికెట్ ఆశిస్తుండటంతో ఎవరికి అవకాశం ఇవ్వాలన్నది ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారింది. ఎన్నికల కోడ్ హడావుడిగా రావడం, నామినేషన్లు, ప్రచారానికి తక్కువ సమయం ఉండటంతో ఆశావహుల్లో ఆందోళన పెరిగింది. టికెట్ దక్కని నేతలు రెబల్స్ గా మారే ప్రమాదం కూటమి నాయకత్వాన్ని కలవరపెడుతోంది.

సీట్ల పంపకాలపై పార్టీల మధ్య పంచాయితీ

టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య వార్డుల కేటాయింపుపై గత కొన్ని రోజులుగా చర్చలు జరుగుతున్నా అసంతృప్తి తగ్గడం లేదు. జనసేన తమకు బలమున్న నియోజకవర్గాల్లో ఎక్కువ స్థానాలు కావాలని పట్టుబడుతోంది. బీజేపీ సైతం రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న సహకారంతో విశాఖలో తమ బలం పెరుగుతోందని, గెలిచే అవకాశాలున్న వార్డులు కేటాయించాలని కోరుతోంది. అయితే తమకు దక్కిన సీట్ల సంఖ్యపై కమలదళం నేతలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. జనసేన కార్యకర్తలు టికెట్ ఇవ్వకపోతే తమ సత్తా చూపిస్తామని హెచ్చరిస్తుండగా, టీడీపీలో కొందరు టికెట్ ఖరారు కాకముందే స్వతంత్రంగా నామినేషన్లు దాఖలు చేశారు. పార్టీ టికెట్ రాకపోతే తదుపరి నిర్ణయం తీసుకుంటామని మరికొందరు స్పష్టం చేస్తున్నారు.

రెబల్స్ బెడదతో ఎన్నికల పోరు రసవత్తరం

గాజువాకలోని కొన్ని వార్డుల్లో వామపక్షాలకు పోటీ ఇచ్చే అవకాశాలున్నాయి. గత కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 58, టీడీపీ 29, జనసేన 3 స్థానాలు గెలుచుకోగా, సీపీఐ, సీపీఎం చెరో వార్డులో విజయం సాధించాయి. మరో నాలుగు స్థానాల్లో స్వతంత్రులు గెలిచారు. బీజేపీ ఒక స్థానాన్ని దక్కించుకుంది. ఈసారి మేయర్ ఎంపిక ప్రత్యక్ష విధానంలో జరుగుతుందని ప్రభుత్వం ప్రకటించడంతో పోటీ మరింత ఆసక్తికరంగా మారింది. అక్టోబర్ 28న పోలింగ్, 30న ఫలితాల ప్రకటన జరగనున్ననేపథ్యంలో పార్టీలకు బుజ్జగింపులు, ప్రచారం, రెబల్స్ ను నియంత్రించడం కీలకంగా మారాయి. కాంగ్రెస్, వామపక్షాలు కూడా తమకు అవకాశమున్నప్రాంతాల్లో పోటీకి సిద్ధమవుతున్నాయి. ఈ నెలాఖరుకు విశాఖ పీఠం ఎవరికి దక్కుతుందో తేలనుంది.



చీరాల మున్సిపల్ పోరు రసవత్తరం

చైర్‌పర్సన్ బరిలో ఇద్దరు డాక్టర్లు.. వార్డుల బరిలో 74 నామినేషన్లు

చీరాల మున్సిపల్ ఎన్నికల సందడి ఊపందుకుంది. తొలిరోజు నిశ్శబ్దంగా ఉన్న మున్సిపల్ కార్యాలయం రెండో రోజు అభ్యర్థుల రాకతో కిటకిటలాడింది. చైర్‌పర్సన్ పదవికి శనివారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ పదవిని ఎస్సీ మహిళకు కేటాయించడంతో ప్రధాన పార్టీలు మహిళా అభ్యర్థులను బరిలోకి దించాయి. వైఎస్సార్‌సీపీ తరపున డాక్టర్ ఇస్తర్ల షెర్లీ, కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ మద్దులూరి రోజ్ పద్మిని నామినేషన్లు సమర్పించారు. వీరితో పాటు ఒక స్వతంత్ర అభ్యర్థి కూడా నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, చైర్‌పర్సన్ పదవికి మొత్తం మూడు నామినేషన్లు నమోదయ్యాయి.

వార్డుల్లో పార్టీల మధ్య పోటీ

మున్సిపాలిటీలోని వివిధ వార్డుల నుంచి మొత్తం 74 నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్‌సీపీ తరపున 31 మంది, కాంగ్రెస్ నుంచి 17 మంది, అధికార టీడీపీ తరపున 24 మంది వార్డు కౌన్సిలర్లుగా పోటీ చేసేందుకు నామినేషన్ పత్రాలను సమర్పించారు. రెండో రోజే పెద్ద సంఖ్యలో నామినేషన్లు నమోదు కావడంతో పట్టణంలో ఎన్నికల వేడి పెరిగింది. ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ నామినేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు కార్యాలయానికి చేరుకోవడంతో అక్కడ సందడి నెలకొంది. రానున్న రోజుల్లో మరిన్ని నామినేషన్లు దాఖలయ్యే అవకాశంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ పెరుగుతోంది.

డాక్టర్ల పోటీపై పట్టణంలో ఆసక్తి

చీరాల చైర్‌పర్సన్ ఎన్నికల్లో ఇద్దరు వైద్యులు ప్రధాన పార్టీల తరపున పోటీకి దిగడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్‌బాబు సిఫార్సుతో బరిలోకి వచ్చిన డాక్టర్ ఇస్తర్ల షెర్లీ, పట్టణంలో సుపరిచితులైన వైద్య దంపతులు డాక్టర్ ఇస్తర్ల బాబురావు, సుభాషిణిల కుమార్తె. మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ మద్దులూరి రోజ్ పద్మిని పోటీ చేస్తున్నారు. చీరాల పురపోరులో ఈ పోటీ ఎలాంటి రాజకీయ మలుపులు తీసుకుంటుందన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

అమలాపురం పీఠం.. జనసేన శ్రీధర్ కు అవకాశం



అమలాపురం మున్సిపల్ ఎన్నికల్లో చైర్ పర్సన్ అభ్యర్థిగా జనసేన పార్టీ తరపున నల్లా శ్రీధర్ ను ఎంపిక చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కూటమి నాయకులు నిర్వహించిన సమావేశంలో పి.గన్నవరం ఎమ్మెల్యే, జనసేన అమలాపురం పార్లమెంట్ సమన్వయకర్త గిడ్డి సత్యనారాయణ ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. అనంతరం శ్రీధర్ ను గిడ్డి సత్యనారాయణ, ఎంపీ సానా సతీష్ దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఓటమి భయంతో రౌడీయిజం: జూలకంటి



స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయంతోనే వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి హింసాత్మక రాజకీయాలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆరోపించారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో, ప్రత్యర్థులపై దాడులు చేయించి, ఆ నిందలను ఇతరులపైకి నెట్టడం జగన్ రాజకీయ వ్యూహమని విమర్శించారు. తమిళనాడు, కర్ణాటక, పంజాబ్ నుంచి రౌడీలను రప్పించి విధ్వంసాలకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి, రాయచోటిలో మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఈ వ్యవహారంలో కీలకంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. పంజాబ్ నుంచి వచ్చిన వ్యక్తుల వద్ద తుపాకులు, పిస్తోళ్లు ఉన్నాయని, పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. దాడులు చేయించి, తిరిగి బాధితులుగా చిత్రించుకునే రాజకీయాలు ప్రజలు సహించరని హెచ్చరించారు.

పురపోరులో నామినేషన్ల జోరు

ప్రొద్దుటూరు మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రెండో రోజు ఊపందుకుంది. శనివారం అభ్యర్థులు భారీగా నామినేషన్లు దాఖలు చేయడంతో మున్సిపల్ కార్యాలయం సందడిగా మారింది. వార్డు సభ్యుల స్థానాలకు 129 మంది అభ్యర్థులు నామినేషన్లు సమర్పించగా, వైస్ చైర్మన్ పదవికి ముగ్గురు బరిలో నిలిచారు. ఈ వివరాలను మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను అధికారులకు అందజేశారు. మరోవైపు, ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు మున్సిపల్ అధికారులు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. రెండో రోజే పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు కావడంతో ప్రొద్దుటూరు పురపోరుపై ఆసక్తి పెరుగుతోంది.

ఎన్నికలకు భారీ భద్రతా ఏర్పాట్లు

120 వార్డుల్లో పోలింగ్ కు అధికారుల సన్నద్ధంవిశాఖపట్నం మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి అభిషిక్త కిషోర్ వివరాల ప్రకారం, ఈ నెల 16 నుంచి 18 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 19న పరిశీలన, 21న మధ్యాహ్నం 3 గంటల్లోపు ఉపసంహరణకు గడువు ముగుస్తుంది. 28న ఉదయం 8 గంటలకు పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. 120 వార్డులకు 40 మంది ఆర్వోలు, 10 వేల మంది పోలింగ్ సిబ్బంది, 10 ఎంసీసీ, 10 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 14 వ్యయపరిశీలన బృందాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు మేయర్ అభ్యర్థులకు ఏడు, కార్పొరేటర్లకు 390కి పైగా నామినేషన్లు వచ్చాయి.

తెలంగాణ నిధులు.. ఏపీ కాంట్రాక్టర్లకు పనులు!

105.93 కోట్ల కాంట్రాక్టులపై ప్రశ్నలు... ఆర్టీఐ లెక్కలతో వెలుగులోకి టెండర్ల బాగోతం



తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో సాగింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పన్నెండేళ్లు దాటిన నేపథ్యంలో మహబూబ్ నగర్ జిల్లా పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన టెండర్ల వివరాలు రాజకీయ చర్చకు తెరలేపాయి. 2014 జూన్ 2 నుంచి 2023 డిసెంబర్ 6 వరకు నమోదైన 2,231 టెండర్ పనుల్లో ఆంధ్రప్రదేశ్ కు చెందిన కాంట్రాక్టర్లకు 74 పనులు కేటాయించినట్లు ఆర్టీఐ ద్వారా పొందిన సమాచారం వెల్లడిస్తోంది. ఈ పనుల మొత్తం విలువ రూ.105,92,97,771గా, అంటే సుమారు రూ.105.93 కోట్లుగా పేర్కొన్నారు. తెలంగాణలో ప్రభుత్వ పనుల కేటాయింపులు ఏ విధంగా జరిగాయి? స్థానిక కాంట్రాక్టర్లకు ఎలాంటి అవకాశాలు లభించాయి? ఇతర రాష్ట్రాల సంస్థలకు పనులు అప్పగించడంలో అనుసరించిన విధానాలేంటి? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆర్టీఐతో బయటపడిన వివరాలు ఆర్టీఐ కార్యకర్త గంజి శ్రీనివాసరావు తెలంగాణ ఆర్థిక శాఖకు టెండర్లకు సంబంధించిన ధ్రువీకరించిన వివరాలు కోరుతూ దరఖాస్తు చేశారు. టెండర్ ఐడీలు, శాఖల పేర్లు, పనులు దక్కించుకున్న సంస్థలు, కాంట్రాక్టు విలువలు వంటి వివరాలను అడిగారు. మహబూబ్ నగర్ జిల్లా పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయానికి సంబంధించిన ప్రజా సమాచార అధికారి ఎంఎస్ ఆఫీస్ ఎక్సెల్ ఫైల్ ద్వారా సమాచారం అందించినట్లు వెల్లడించారు. ఈ వివరాల్లో పలు సంస్థలకు కేటాయించిన పనుల విలువలు సమోదయ్యాయి. అయితే టెండర్ల వారీగా పోటీ చేసిన సంస్థలు, అర్హత ప్రమాణాలు, తిరస్కరించిన బిడ్లు, పనుల పూర్తిస్థాయి వివరాలను పరిశీలిస్తేనే కాంట్రాక్టుల కేటాయింపులో పారదర్శకతపై స్పష్టత వస్తుంది.

రూ.కోట్ల పనులు.. సంస్థల వారీగా లెక్కలు

వెల్లడైన పట్టిక ప్రకారం ఎంఆర్ జీఆర్ కన్ స్ట్రక్షన్స్ కు రూ.25.38 కోట్లు, బీఏఎంఎస్ ఎం కన్ స్ట్రక్షన్స్ కు రూ.24.19 కోట్లు, భవానీ కన్ స్ట్రక్షన్స్ కు రూ.16 కోట్ల విలువైన పనులు కేటాయించినట్లు పేర్కొన్నారు. బాలాజీకి రూ.8.80 కోట్లు, జె. అశ్వర్థకు రూ.7.93 కోట్లు, వైఎంఆర్ కన్ స్ట్రక్షన్స్ కు రూ.6.80 కోట్ల విలువైన పనులు దక్కినట్లు సమాచారం. మిగిలిన సంస్థలకు కూడా వివిధ మొత్తాల్లో కాంట్రాక్టులు కేటాయించారు. ఈ గణాంకాల నేపథ్యంలో టెండర్లలో పోటీ ఎలా జరిగింది? ప్రభుత్వ అంచనా వ్యయాలకు, ఖరారైన కాంట్రాక్టు మొత్తాలకు మధ్య ఎంత వ్యత్యాసం ఉంది? పనుల నాణ్యతను ఎవరు పర్యవేక్షించారు? అనే అంశాలపై ప్రభుత్వం వివరాలు వెల్లడించాల్సిన అవసరం ఉంది. పారదర్శకతపై ప్రశ్నలు.. ప్రభుత్వమే సమాధానం చెప్పాలి.

- గంజి శ్రీనివాసరావు, ఆర్టీఐ కార్యకర్త



ఒకప్పుడు కాలేజీ గేటు దగ్గర మొదలైన పరిచయం.. తరగతి గదిలో చూపుల కలయికతో ప్రేమగా మారేది. క్యాంటీన్‌లో చిన్న పలకరింపులు, గ్రంథాలయం దగ్గర ఎదురుచూపులు, బస్టాండ్‌లో వీడ్కోలు క్షణాలు.. యువత హృదయాల్లో మధుర జ్ఞాపకాలుగా నిలిచిపోయేవి. ఒక చిన్న చిరునవ్వు రోజంతా ఆనందాన్నిచ్చేది. ఫోన్‌లో మాట్లాడేందుకు గంటల తరబడి ఎదురుచూసే రోజులు కూడా ఉండేవి. కాలం మారింది. చదువులు పూర్తయ్యాయి. ఉద్యోగాలు వచ్చాయి. పెళ్లిళ్లు జరిగాయి. పిల్లలు పుట్టారు. బాధ్యతలు పెరిగాయి. జీవిత ప్రయాణంలో ఎన్నో మలుపులు ఎదురైనా.. మనసును అర్థం చేసుకునే తోడు కావాలనే కోరిక మాత్రం చాలామందిలో అలాగే ఉంది. ఇప్పుడు ఒకప్పుడు కాలేజీల్లో కనిపించిన ఆ వాతావరణం కొన్ని కార్యాలయాల్లోనూ కనిపిస్తోంది. సహోద్యోగుల మధ్య పరిచయాలు, కాఫీ విరామాల్లో సరదా సంభాషణలు, పనిలో ఒకరికొకరు సహకరించుకోవడం, చిన్న విజయాలను పంచుకోవడం.. కొత్త అనుబంధాలకు పునాది వేస్తున్నాయి. రోజూ ఒకే ప్రదేశంలో గంటల తరబడి గడిపే వ్యక్తుల మధ్య సహజంగానే సాన్నిహిత్యం పెరిగే అవకాశం ఉంటుంది. మొదట పని గురించి మొదలైన మాటలు క్రమంగా వ్యక్తిగత విషయాల వైపు మళ్లవచ్చు. ఒకరి ఇష్టాయిష్టాలు మరొకరికి తెలిసివస్తాయి. ఎదుటివారి ఆలోచనలు, ప్రవర్తన, సమస్యలను ఎదుర్కొనే విధానం ఆకర్షణకు కారణమవుతాయి. అయితే ప్రతి పలకరింపూ ప్రేమ కాదు.. ప్రతి స్నేహం జీవిత బంధంగా మారదు. కొందరికి కార్యాలయ పరిచయం జీవిత భాగస్వామిని పరిచయం చేస్తే, మరికొందరికి ఆత్మీయ స్నేహాన్ని అందిస్తుంది. ఇంకొందరి జీవితాల్లో ఊహించని మలుపులకు కారణమవుతుంది. అందుకే కార్యాలయ ప్రేమను కేవలం ఆకర్షణగా చూడలేం. మారుతున్న ఉద్యోగ సంస్కృతి, వ్యక్తిగత జీవితంలోని అవసరాలు, మనుషుల మధ్య పెరుగుతున్న పరిచయాలు ఈ పరిణామానికి నేపథ్యంగా నిలుస్తున్నాయి.

• ఆఫీసులోనే విందు... పసందు.. ఆనందం!

ఆధునిక ఉద్యోగ ప్రపంచంలో ఇంటికంటే కార్యాలయంలోనే ఎక్కువ సమయం గడుపుతున్నవారు చాలామంది. ప్రయాణాలు, పని ఒత్తిడి, అదనపు బాధ్యతలతో కుటుంబానికి కేటాయించే సమయం తగ్గిపోతోంది. సామాజిక మాధ్యమాలు, ఫోన్లు వ్యక్తిగత జీవితంలోకి చొరబడటంతో ఇంట్లో ఉన్నా ఆత్మీయ సంభాషణలు కరువవుతున్నాయి. కుటుంబ బంధాలు నిలవాలంటే ఒకరికొకరు సమయం కేటాయించడం, ప్రేమను వ్యక్తం చేయడం, బాధ్యతలను పంచుకోవడం అవసరం. ఉద్యోగం ఆదాయాన్నిస్తుంది కానీ జీవితం మొత్తం ఉద్యోగమే కాదు. మరోవైపు కార్యాలయాల్లో సహోద్యోగుల మధ్య పరిచయాలు ప్రేమగా మారడం సహజమే. కలిసి పనిచేయడం, ఒకరి ఆలోచనలను మరొకరు అర్థం చేసుకోవడం, కష్టసుఖాల్లో తోడుగా నిలవడం బలమైన బంధాలకు పునాది వేయవచ్చు. అయితే ఆకర్షణ తాత్కాలికం కావచ్చు. అందుకే తొందరపడి నిర్ణయాలు తీసుకోకుండా ఒకరినొకరు అర్థం చేసుకోవాలి. ప్రేమలో బాధ్యత, పరస్పర గౌరవం, వ్యక్తిగత స్వేచ్ఛకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇంట్లో ఆత్మీయత తగ్గిందని బయట కొత్త బంధం కోసం వెతకడమే పరిష్కారం కాదు. కొన్నిసార్లు మనసు విప్పి మాట్లాడుకోవడం, ఒకరి అవసరాలను మరొకరు గుర్తించడం సమస్యలను పరిష్కరించగలవు. ఒంటరిగా ఉన్నవారికి కొత్త స్నేహాలు, ప్రేమ సంబంధాలు ఆనందాన్ని అందించవచ్చు. అయితే ఏ బంధమైనా నిజాయతీ, పరస్పర సమ్మతితో కొనసాగాలి. కార్యాలయంలో ప్రేమ చిగురించవచ్చు కానీ అది ఇంటికి ప్రత్యామ్నాయం కాదు. రోజంతా పని చేసి ఇంటికి వచ్చినప్పుడు ఆత్మీయంగా పలకరించే మనిషి ఉండటం, ఫోన్లు పక్కనపెట్టి మనసు విప్పి మాట్లాడుకోవడం నిజమైన విశ్రాంతినిస్తుంది. ప్రేమ ఎక్కడ పుడుతుందన్నదానికంటే అది ఎలా పెరుగుతుందన్నదే ముఖ్యం. మనసును అర్థం చేసుకునే మనిషి ఉన్నచోటే ప్రేమకు చిరునామా. ఆ ప్రేమలో నమ్మకం, నిజాయతీ, గౌరవం ఉంటేనే జీవితానికి నిజమైన అందం!



కొలీగ్స్ మధ్య ప్రేమ గుర్రాలైతే..!

- ఇంట్లో దూరం.. ఆఫీసులో ప్రేమ తీరం
- పలకరింపుల్లో మొదలవుతోన్న బంధం
- కాలేజీ రోజుల జాయ్.. నిత్యం ఎంజాయ్
- ఇంట్లో మౌనం.. ఆఫీసులో ప్రేమ గానం!

• కరోనా తర్వాత.. సందడిగా కార్యాలయాలు!

కరోనా మహమ్మారి ప్రపంచాన్ని కుదిపేసిన సమయంలో ఉద్యోగ ప్రపంచంలోనూ భారీ మార్పులు వచ్చాయి. కార్యాలయాల తలుపులు మూతపడ్డాయి. కంప్యూటర్లు ఇళ్లలోకి చేరాయి. సమావేశాలు వీడియో కాల్స్‌కు పరిమితమయ్యాయి. సహోద్యోగులతో ప్రత్యక్షంగా మాట్లాడే అవకాశాలు తగ్గిపోయాయి. ఇంటి గదే కార్యాలయంగా మారింది. భోజనాల బల్ల సమావేశాల ప్రదేశమైంది. కుటుంబ సభ్యుల మధ్య ఉంటూనే ఉద్యోగ బాధ్యతలను నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొదట్లో ఈ విధానం సౌకర్యంగా అనిపించింది. ట్రాఫిక్ సమస్యలు లేవు. ప్రయాణాల అలసట లేదు. ఉదయం కార్యాలయానికి పరుగెత్తాల్సిన అవసరం తగ్గింది. కానీ రోజులు గడిచేకొద్దీ కొందరికి ఇంటి నుంచే పనిచేయడం భారంగా మారింది. పని వేళలకు స్పష్టమైన హద్దులు లేకపోవడంతో కార్యాలయ బాధ్యతలు రాత్రి వరకు కొనసాగేవి. కుటుంబానికి కేటాయించాల్సిన సమయం తగ్గేది. సహోద్యోగులతో ప్రత్యక్ష సంభాషణలు లేకపోవడం వల్ల బృందంలో కలిసి పనిచేసే ఉత్సాహం కూడా కొరవడేది. ఈ నేపథ్యంలో అనేక సంస్థలు ఉద్యోగులను తిరిగి కార్యాలయాలకు పిలవడం ప్రారంభించాయి. కొన్ని సంస్థలు పూర్తిస్థాయి కార్యాలయ పనిని అమలు చేయగా, మరికొన్ని సంస్థలు వారంలో కొన్ని రోజులు కార్యాలయంలో, మిగతా రోజులు ఇంటి నుంచి పనిచేసే విధానాన్ని అనుసరించాయి. దీంతో కార్యాలయాలు మళ్లీ సందడిగా మారాయి. పాత పరిచయాలు పునరుద్ధరించబడ్డాయి. కొత్త ఉద్యోగులు బృందాల్లో చేరారు. కాఫీ యంత్రాల దగ్గర సంభాషణలు, భోజన విరామాల్లో సరదా మాటలు, పని ముగిసిన తరువాత చిన్నపాటి సమావేశాలు పెరిగాయి. ఉద్యోగులు ఒకరినొకరు దగ్గరగా తెలుసుకునే అవకాశాలు మళ్లీ ఏర్పడ్డాయి. ఈ పరిచయాలు కొందరిలో స్నేహంగా, మరికొందరిలో ఆత్మీయతగా, ఇంకొందరిలో ప్రేమగా రూపాంతరం చెందుతున్నాయి. ఉద్యోగ స్థలం ఇప్పుడు పని పూర్తి చేసే ప్రదేశమే కాదు.. మనుషులను కలిపే వేదికగా కూడా మారుతోంది. అయితే ఈ పరిణామాన్ని ప్రతి కార్యాలయానికి వర్తించే సాధారణ సత్యంగా చూడకూడదు. సంస్థల వాతావరణం, ఉద్యోగుల వ్యక్తిగత పరిస్థితులు, వారి పరస్పర సంబంధాలపై ఈ అనుబంధాల స్వభావం ఆధారపడి ఉంటుంది.

• చూపులతో మొదలవుతున్న వింత బంధాలు!

కార్యాలయ ప్రేమకు ఒక ప్రత్యేకమైన నేపథ్యం ఉంటుంది. ఇక్కడ ఇద్దరు వ్యక్తులు ఒకరి ప్రవర్తనను మరొకరు ప్రతిరోజూ గమనించే అవకాశం ఉంటుంది. ఎవరు కష్టపడి పనిచేస్తున్నారు? ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఉంటున్నారు? తప్పు జరిగినప్పుడు బాధ్యత తీసుకుంటున్నారు? ఇతరుల అభిప్రాయాలను గౌరవిస్తున్నారు? ఇలాంటి లక్షణాలు క్రమంగా ఆకర్షణను పెంచవచ్చు. కాలేజీ రోజుల్లో అందం, మాటతీరు, సరదా ఎక్కువగా ఆకట్టుకోవచ్చు. ఉద్యోగ జీవితంలో మాత్రం వ్యక్తిత్వం, బాధ్యత, సహనం, సమస్యలను పరిష్కరించే తీరు కూడా ప్రాధాన్యం పొందుతాయి. ఒక క్లిష్టమైన పనిలో సహోద్యోగి అండగా నిలబడటం మనసుకు దగ్గర చేస్తుంది. సమావేశంలో మన అభిప్రాయానికి విలువ ఇవ్వడం ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. మనం బాధలో ఉన్నప్పుడు కారణం అడిగి ఓదార్చడం ఆత్మీయతను పెంచుతుంది. ప్రతిరోజూ పలకరించే వ్యక్తి ఒకరోజు కనిపించకపోతే ఏదో వెలితిగా అనిపించవచ్చు. మొదట సాధారణంగా కనిపించిన పరిచయం క్రమంగా ప్రత్యేకమైన అనుబంధంగా మారవచ్చు. అయితే ఈ ప్రయాణంలో పరస్పర సమ్మతి, వ్యక్తిగత హద్దులు అత్యంత కీలకం. ఒకరికి సాధారణ స్నేహంగా అనిపించిన మాట మరొకరికి ప్రేమ సూచనగా కనిపించవచ్చు. ఒక చిరునవ్వుకు ఎదుటివారు ప్రత్యేకమైన అర్థం కల్పించవచ్చు. అందుకే ఎదుటివారి భావాలను స్పష్టంగా అర్థం చేసుకోకుండా ఊహలకు ప్రాధాన్యం ఇవ్వకూడదు. కార్యాలయంలో ఎవరి వ్యక్తిగత భావాలనూ మరొకరు బలవంతంగా అంగీకరించాల్సిన అవసరం లేదు. ప్రేమను వ్యక్తం చేయడం ఒకరి హక్కు కావచ్చు. దాన్ని అంగీకరించాలా వద్దా అనేది ఎదుటివారి నిర్ణయం. ఆ నిర్ణయాన్ని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఆకర్షణకు ఆరంభం చూపులు కావచ్చు.. కానీ బంధానికి పునాది నమ్మకం, గౌరవం, పరస్పర అంగీకారమే. కార్యాలయంలో ఏర్పడిన పరిచయం జీవితాంతం నిలవాలంటే భావోద్వేగాలకంటే ముందుగా వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవాలి. తొలిచూపులో కలిగిన భావన ఆధారంగా తొందరపడి నిర్ణయాలు తీసుకోకుండా, ఒకరినొకరు తెలుసుకునేందుకు సమయం ఇవ్వాలి. అప్పుడే ఆ అనుబంధం ఆరోగ్యకరమైన బంధంగా ఎదిగే అవకాశం ఉంటుంది.

• ఇంట్లో దూరం.. వీధుల్లో ఆత్మీయత!

వివాహితుల ఉద్యోగ జీవితం మరో కోణాన్ని ఆవిష్కరిస్తోంది. ముఖ్యంగా భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేసే కుటుంబాల్లో సమయం అత్యంత విలువైనది. ఉదయం నిద్రలేచినప్పటి నుంచి పనుల జాబితా మొదలవుతుంది. పిల్లలను సిద్ధం చేయాలి. ఇంటి బాధ్యతలు చూసుకోవాలి. కార్యాలయానికి చేరుకోవాలి. రోజంతా సమావేశాలు, గడువులు, లక్ష్యాలు, పై అధికారుల ఒత్తిడితో గడిచిపోతుంది. సాయంత్రం ఇంటికి చేరేసరికి శరీరం అలసిపోతుంది. మనసు మాత్రం కార్యాలయ సమస్యల నుంచి బయటపడకపోవచ్చు. భోజనం, పిల్లల చదువులు, మరుసటి రోజు ఏర్పాట్లతో సమయం గడిచిపోతుంది. ఒకప్పుడు గంటల తరబడి మాట్లాడుకున్న భార్యాభర్తలు ఇప్పుడు అవసరమైన విషయాలకే సంభాషణను పరిమితం చేసుకునే పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ప్రేమ తగ్గకపోయినా దాన్ని వ్యక్తం చేసే సమయం తగ్గిపోవచ్చు. ఒకరి అలసటను మరొకరు అర్థం చేసుకోలేకపోతే అపార్థాలు పెరగవచ్చు. ఒకే ఇంట్లో



ఉంటూ కూడా మనసులోని మాటలు పంచుకోలేని పరిస్థితి ఏర్పడవచ్చు. రాత్రి భోజనం తరువాత ఒకరు ఫోన్‌లో మునిగిపోతే, మరొకరు టెలివిజన్ చూస్తూ కాలక్షేపం చేయవచ్చు. పక్కపక్కనే ఉన్నా రోజంతా జరిగిన విషయాలను పంచుకోకుండానే నిద్రపోయే జంటలూ ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో శారీరకంగా దగ్గరగా ఉన్నా భావోద్వేగంగా దూరమయ్యే ప్రమాదం ఉంది. ఈ ఖాళీని కొందరు కార్యాలయ పరిచయాల ద్వారా పూడ్చుకోవాలని భావించవచ్చు. ఇంట్లో చెప్పుకోలేని విషయాన్ని సహోద్యోగితో పంచుకోవడం మొదలవుతుంది. తన మాటను శ్రద్ధగా వింటున్న వ్యక్తి పట్ల అభిమానం పెరుగుతుంది. పని ఒత్తిడిని అర్థం చేసుకోవడం, చిన్న విజయాన్ని అభినందించడం, కష్ట సమయంలో ధైర్యం చెప్పడం ప్రత్యేకమైన అనుబంధానికి దారితీయవచ్చు. అయితే ఇంట్లో సమయం తగ్గిందని బయట కొత్త బంధం కోసం వెతకడమే పరిష్కారం కాదు. కొన్నిసార్లు భార్యాభర్తలు పరస్పరం మనసు విప్పి మాట్లాడుకోవడం, బాధ్యతలను పంచుకోవడం, ఒకరికొకరు సమయం కేటాయించడం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చు. రోజులో పది నిమిషాలైనా ఫోన్లు పక్కన పెట్టి మాట్లాడుకోవడం, కలిసి కాఫీ తాగడం, ఎదుటివారి సమస్యలను శ్రద్ధగా వినడం బంధానికి కొత్త ఊపిరిని అందించవచ్చు. ప్రేమను నిలబెట్టుకోవడానికి పెద్ద బహుమతులు అవసరం లేదు. చిన్న చిన్న శ్రద్ధలు, ఆత్మీయమైన పలకరింపులు, పరస్పర అవగాహన కూడా ఎంతో విలువైనవి.


• అంతులేని ఆకర్షణ.. బంధాలకు రాంరాం!

కార్యాలయంలో లభించే ఆత్మీయత కొందరికి ప్రత్యేకమైన అనుభూతిని అందించవచ్చు. ఇంట్లో తన మాటకు సమయం దొరకడం లేదని భావించే వ్యక్తికి కార్యాలయంలో తన సమస్యను శ్రద్ధగా వింటున్న సహోద్యోగి ముఖ్యంగా అనిపించవచ్చు. అయితే ఈ అనుబంధం ఎక్కడికి దారితీస్తుందన్నది వ్యక్తుల నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది. స్నేహం ఆరోగ్యకరమైన పరిమితుల్లో కొనసాగవచ్చు. కానీ దాన్ని రహస్య సంబంధంగా మార్చుకుంటే అపనమ్మకం, అపార్థాలు, కుటుంబ కలహాలు మొదలయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా వివాహితుల విషయంలో జీవిత భాగస్వామికి తెలియకుండా వ్యక్తిగత అనుబంధాన్ని పెంచుకోవడం కుటుంబ బంధాలను దెబ్బతీయవచ్చు. అదే సమయంలో ప్రతి కార్యాలయ స్నేహాన్ని అనుమానంతో చూడటం కూడా సరైన విధానం కాదు. సహోద్యోగుల మధ్య గౌరవప్రదమైన స్నేహం ఉండటం సహజం. అసలు ప్రశ్న ఆ బంధం ఇద్దరి జీవితాల్లో ప్రశాంతతను పెంచుతోందా? లేక మరొకరి నమ్మకాన్ని దెబ్బతీస్తోందా? అనేదే. ఆకర్షణ కలగడం మానవ సహజం. కానీ ఆ ఆకర్షణ ఆధారంగా తీసుకునే నిర్ణయాలకు బాధ్యత వహించాల్సింది కూడా మనుషులే. క్షణికమైన ఆనందం కోసం దీర్ఘకాలిక బంధాలను ప్రమాదంలోకి నెట్టే ముందు పరిణామాలను ఆలోచించాలి. ప్రేమ, ఆకర్షణ, శారీరక సాన్నిహిత్యం విషయంలో ప్రతి వ్యక్తికీ తన శరీరంపై, తన నిర్ణయాలపై హక్కు ఉంటుంది. ఇద్దరు పెద్దల మధ్య పరస్పర సమ్మతితో ఏర్పడే బంధాన్ని గౌరవించాలి. అదే సమయంలో ఒత్తిడి, బెదిరింపులు, పదోన్నతుల ఆశ చూపడం, ఉద్యోగ హోదాను ఉపయోగించుకుని వ్యక్తిగత సంబంధానికి ఒత్తిడి చేయడం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదు. ఒకరు చూపే ఆసక్తిని మరొకరు అంగీకరించకపోతే ఆ నిర్ణయాన్ని గౌరవించాలి. స్నేహం పేరుతో వ్యక్తిగత స్వేచ్ఛను ఉల్లంఘించడం, అనుమతి లేకుండా సందేశాలను బయటపెట్టడం, సహోద్యోగుల వ్యక్తిగత జీవితాలపై పుకార్లు వ్యాప్తి చేయడం బాధ్యతారాహిత్యమే. కార్యాలయాలు వృత్తిపరమైన గౌరవానికి నిలయాలుగా ఉండాలి. అక్కడ ప్రేమ చిగురిస్తే అది పరస్పర సమ్మతి, నిజాయతీ, స్పష్టమైన హద్దులపై ఆధారపడి సాగాలి. ఒకరి వృత్తిపరమైన స్థానం మరొకరిపై ప్రభావం చూపే పరిస్థితుల్లో మరింత జాగ్రత్త అవసరం. ప్రేమ పేరుతో గోప్యతను దెబ్బతీయకూడదు. అనుమానాల పేరుతో ప్రతి సంభాషణను తప్పుగా అర్థం చేసుకోకూడదు. ఆరోగ్యకరమైన కార్యాలయ వాతావరణం అంటే ప్రేమను నిషేధించడం కాదు.. ఎవరికీ అసౌకర్యం కలగకుండా, ఎవరి హక్కులూ దెబ్బతినకుండా సంబంధాలు కొనసాగేందుకు అవకాశం కల్పించడం.

- హుస్సేన్

చలికాలం రావాలి.. చల్లని గాలులు వీయాలి.. కానీ తెలంగాణలో మాత్రం ఎండల సెగ తగ్గడం లేదు! ఆకాశం వర్షించక.. జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గితే.. రేపటి దాహం తీర్చేదెలా? పాలాలకు నీళ్లిచ్చేదెలా? ఇప్పటికే ధరల భారంతో సతమతమవుతున్న సామాన్యుడికి నీటి కష్టాలు మరో శాపంగా మారనున్నాయా? ఎల్‌నినో ప్రభావంతో రాబోయే నెలల్లో పరిస్థితులు మరింత కఠినంగా మారవచ్చన్న ఆందోళనలు రాష్ట్రాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. యాసంగిలో వరి సాగుకు దూరంగా ఉండాలన్న సీఎం రేవంత్‌రెడ్డి సూచనలు రైతుల్లో కొత్త ప్రశ్నలు రేపుతున్నాయి. మరోవైపు, నీటి నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందంటూ బీఆర్ఎస్ విమర్శల దాడి పెంచుతోంది. ఏపీలో జల పండుగ.. తెలంగాణలో నీటి గండం అంటూ రాజకీయ రగడ రాజుకుంటోంది. అసలు సమస్య ప్రకృతి సృష్టించిన వర్షాభావమా? అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించడంలో పాలనా వైఫల్యమా? తాగునీరు, సాగునీరు, విద్యుత్.. మూడింటిపైనా ఒత్తిడి పెరిగితే సామాన్యుడి బతుకు ఎలా? రైతు పంటకు భరోసా ఎవరు? ప్రభుత్వం చెబుతున్న ముందస్తు చర్యలు ఎంతవరకు ఫలిస్తాయి? ప్రతిపక్షాల ఆరోపణల్లో వాస్తవమెంత? ఇది కేవలం ఎండల సమస్య కాదు.. తెలంగాణ భవిష్యత్తుకు ఎదురైన నీటి పరీక్ష! అసలు ఏం జరుగుతోంది? రాబోయే రోజుల్లో ముంచుకొచ్చే ముప్పును తప్పించుకునే మార్గాలేంటి?

- రైతుకు గుండెకోత.. సామాన్యుడికి వాత
- సర్కారుకు సంకటం.. ప్రతిపక్షాల చెలగాటం
- రేవంత్ నాయకత్వానికి రియల్ సవాల్



చలికాలంలో ఎండాకాలం

తెలంగాణలో ఎల్ నినో ప్రభావం

తెలంగాణలో చలికాలం ప్రారంభం కావాల్సిన సమయంలోనే ఎండల తీవ్రత, నీటి లభ్యతపై ఆందోళనలు పెరుగుతున్నాయి. సాధారణంగా చలికాలంలో వాతావరణం చల్లబడాలి. కానీ ఈసారి వర్షాల లోటు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, జలాశయాల్లో తగ్గుతున్న నీటి నిల్వలు రాబోయే రోజుల్లో ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయనే ప్రశ్నను ముందుకు తెస్తున్నాయి. ముఖ్యంగా తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరా విషయంలో ప్రభుత్వం ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాలు సరిగా కురవకపోతే భూగర్భజలాలు తగ్గిపోవడం, చెరువులు నిండకపోవడం, బోర్లలో నీరు అడుగంటడం వంటి సమస్యలు ఒకదాని వెంట మరొకటి ఎదురవుతాయి. వీటి ప్రభావం గ్రామీణ ప్రాంతాలకే పరిమితం కాకుండా పట్టణాలపైనా పడే అవకాశం ఉంది. ఎల్ నినో ప్రభావం.. వర్షాలపై అనిశ్చితి... ప్రస్తుతం తెలంగాణ ఎదుర్కొంటున్న వాతావరణ ఆందోళనలకు ఎల్ నినో ప్రధాన కారణాల్లో ఒకటిగా ప్రభుత్వం పేర్కొంటోంది. పసిఫిక్ మహాసముద్రంలోని సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో చోటుచేసుకునే మార్పులతో సంబంధం ఉన్న ఈ వాతావరణ పరిస్థితి ప్రపంచవ్యాప్తంగా గాలుల కదలికలు, వర్షపాత నమూనాలను ప్రభావితం చేయగలదు. భారతదేశంలో కొన్ని ప్రాంతాల్లో వర్షాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుంది. అయితే ఎల్ నినో వచ్చిన ప్రతిసారీ దేశమంతటా ఒకే విధమైన కరువు ఏర్పడుతుందని చెప్పలేం. ప్రాంతాలవారీగా ప్రభావం మారుతుంది.

తెలంగాణలో ఇప్పటికే నమోదైన వర్షాల లోటు, జలాశయాల పరిస్థితి, రాబోయే నెలల్లో వాతావరణ అంచనాలను కలిపి పరిశీలించాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాబోయే ఎనిమిది నుంచి పది నెలలు కీలకమని చెబుతూ నీరు, విద్యుత్ వినియోగంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు. వర్షాలు తగ్గినప్పుడు దాని ప్రభావం వెంటనే ప్రతి ప్రాంతంలో కనిపించకపోవచ్చు. మొదట నేలలో తేమ తగ్గుతుంది. తర్వాత చెరువులు, కుంటల్లోకి వచ్చే నీరు తగ్గుతుంది. భూగర్భజలాలపై ఆధారపడే రైతులు బోర్లను మరింత లోతుగా వేయాల్సి రావచ్చు. తాగునీటి అవసరాలు తీర్చేందుకు గ్రామాల్లో ట్యాంకర్లపై ఆధారపడే పరిస్థితి ఏర్పడవచ్చు. నగరాల్లోనూ నీటి సరఫరా వ్యవస్థలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ పరిణామాలన్నీ ఒకేసారి సంభవిస్తాయని ఇప్పుడే నిర్ధారించలేం. కానీ ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే సమస్యలు తీవ్రతరం కావచ్చు. అందుకే ప్రభుత్వం వర్షాల పరిస్థితిని, జలాశయాల్లో నిల్వలను, విద్యుత్ అవసరాలను నిరంతరం పరిశీలించాల్సి ఉంది. ప్రజలు కూడా అవసరానికి మించి నీటిని వృథా చేయకుండా జాగ్రత్తపడాలి. ప్రకృతి పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పుడు ముందస్తు ప్రణాళికే ప్రజలకు రక్షణగా నిలుస్తుంది.

• జలాశయాల నిల్వలపై పెరుగుతున్న ప్రశ్నలు

